## "కలివివనం" సినిమా పోస్టర్ ఆవిష్కరణ




# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

## ఏటూరునాగారం కేజీబీవీలో విద్యార్థుల అద్భుత ప్రదర్శనలు




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 322 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శనివారం 15 నవంబర్ 2025


# జూబ్లీహిల్స్‌లో ప్రజలు విలక్షణమైన తీర్పు

**గత రెండేళ్ల మా పాలనను గమనించి ఓటేశారు**

**ఈ విజయంతో మా బాధ్యత మరింత పెరిగింది**

**హైదరాబాద్ అభివృద్ధిలో ఇక మరింత దూకుడు**

**విపక్షాలు విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలి**

**రాష్ట్ర సమస్యల పరిష్కారంలో కిషన్ రెడ్డి సహకరించాలి**

**సచివాలయానికి రావాలని స్వయంగా ఆహ్వానిస్తున్నా...**

**కెటిఆర్,హరీష్ రావులు బాధ్యతాయుత పాత్ర నిర్వహించాలి**

**గెలుపొందిన నవీన్ యాదవ్‌కు సన్మానం**

**మీడియా సమావేశంలో సిఎం రేవంత్ వెల్లడి**



**హైదరాబాద్,నవంబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం తమ బాధ్యతను మరింత పెంచిందని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటర్లు విలక్షణమైన తీర్పు ఇచ్చారని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా నవీన్ యాదవ్‌ను సీఎం రేవంత్ రెడ్డి సన్మానించి.. అభినందనలు తెలిపారు. ఎన్ని ఓటములు వచ్చినా .. కాంగ్రెస్ ప్రజల మధ్య మనుగడ సాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. అధికారంలో ఉంటే ప్రజా సమస్యలు పరిష్కరించడం, ప్రతిపక్షంలో ఉంటే ప్రజల సమస్యలపై పోరాడడం కాంగ్రెస్ విధాన మని అన్నారు. జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో విజయం సాధించిన సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. మిగతా2లో...



**ఘోరంగా పరాజయం పాలైన మహాఘట్‌బంధన్**

**ప్రభావం చూపని ప్రశాంత్ కిశోర్ జన్‌సురాజ్ పార్టీ**

**కూటమికి అభినందనలు తెలిపిన ప్రధాని మోడీ**



# బీహార్‌లో ఎన్‌డిఎ సునామీ

## 202 సీట్లు గెల్చుకున్న ఎన్‌డిఏ కూటమి

**పాట్నా,నవంబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఏన్డీయే స్పష్టమైన ఆధిక్యం కనబర్చింది. ఎగ్జిట్ పోల్ అంచనాలను మించి 202 సీట్లలో గెలుపొంది చరిత్ర సృష్టించింది. బిజెపి ఒంటరిగా దాదాపు 99 సీట్లను గెల్చుకోవడం విశేషం. ఓరకంగా చెప్పాలంటే సునామీ సృష్టించింది. భారతీయ జనతా పార్టీ , జనతా దళ్ (యునైటెడ్) తో పాటు, ఎన్డీఏ కూటమిలో కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ రామ్ విలాస్, కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీకి చెందిన హిందుస్తానీ అవామ్ మోర్చా (సెక్యులర్), రాజ్యసభ ఎంపీ ఉపేంద్ర కుష్వాహా నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్ మోర్చా ఉన్నాయి. మొత్తం 122 స్థానాలు మెజారిటీ మార్కుగా ఉన్న బీహార్‌లో.. ఈ కూటమి 200కు పైగా స్థానాలతో అధికారాన్ని

మిగతా2లో...

---

## అభివృద్ధి, సంక్షేమంలో బాబు రోల్ మోడల్

**హైదరాబాద్‌ను గ్లోబల్ ఐటి కేంద్రంగా తీర్చి దిద్దారు**

**మోడీ నేతృత్వంలో ఆర్థికాభివృద్ధి భారత్ దూకుడు**

**విశాఖ సిఐఐ సదస్సులో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్**



**విశాఖపట్టణం,నవంబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** అభివృద్ధి, సంక్షేమానికి సీఎం చంద్రబాబు నాయుడు రోల్ మోడల్ అని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. మిగతా2లో...


## గ్లోబల్ ట్రేడ్ గేట్ వేగా విశాఖపట్నం

**2047 స్వర్ణాంధ్ర విజన్‌తో సాంకేతికంగా, ఆర్థికంగా బలోపేతం**

**విజనరీ సీఎం చంద్రబాబు వల్లే ఇదంతా సాధ్యం**

**ఎపి గురించే కాకుండా దేశం గురించి ఆలోచించే నేత చంద్రబాబు**

**సిఐఐ సదస్సులో కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్**




## వచ్చే ఎన్నికల్లో వందసీట్లు సాధిస్తాం

**- జూబ్లీహిల్స్ విజయంపై పిసిసి చీఫ్**



**నిజామాబాద్,నవంబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** వచ్చే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 100 సీట్లు గెలుస్తుందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరిస్తున్నారని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలవడంతో నిజామాబాద్‌లో ఆయన మీడియాతో మిగతా2లో...

## ఏపీకి గ్రోత్ కారిడార్‌గా విశాఖపట్నం అభివృద్ధి

**అమరావతిని, విశాఖను పరుగులు పెట్టిస్తున్న చంద్రబాబు**

**ఏపీకి వచ్చే పెట్టుబడులకు త్వరితంగా అనుమతులు**

**సీఐఐ పెట్టుబడుల సదస్సులో మంత్రి నారా లోకేష్**




**విశాఖపట్టణం,నవంబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశానికి గ్రోత్ ఇంజన్‌గా ఏపీ, ఏపీకి గ్రోత్ కారిడార్‌గా విశాఖపట్నం తయారవుతున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. మిగతా2లో...

## ఎంఐఎం మద్దతుతోనే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**



**హైదరాబాద్, 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎంఐఎం మద్దతు, డబ్బుతోనే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ గెలిచిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ప్రత్యేక పరిస్థితులలో జూబ్లీహిల్స్ ఎన్నికలు జరిగాయని.. తమ పార్టీ అక్కడ బలహీనంగా ఉందని తెలిపారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మిగతా2లో...




## జూబ్లీహిల్స్‌లో బిఆర్ఎస్ ఓటమి

**- కర్మ హిట్స్ బ్యాక్ అంటూ కవిత ట్వీట్**

## జూబ్లీహిల్స్‌లో రౌడీయిజంతో ఉప ఎన్నిక

**- అప్రజాస్వామ్యంగా జరిగిన ఎన్నిక ఇది**

**- ఓటమితో బిఆర్ఎస్ అభ్యర్థి సునీత ఆరోపణ**



**హైదరాబాద్,నవంబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** జూబ్లీహిల్స్‌లో రౌడీయిజంతో ఉప ఎన్నిక జరిగిందని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో అప్రజాస్వామ్యంగా జరిగిన ఎన్నిక ఇది అని ఆమె అభివర్ణించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపొందారు. ఈ నేపథ్యంలో మాగంటి సునీత తనదైన శైలిలో స్పందించారు. ప్రజలను

మిగతా2లో...

## రాజకీయాల్లో గెలుపోటములు సహజం

**ఓటమితో కుంగిపోయే పరిస్థితి లేదు**

**ప్రతిపక్ష పార్టీగా కొట్లాడుతూనే ఉంటాం**

**జూబ్లీహిల్స్ ఓటమిపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్**




**హైదరాబాద్,నవంబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, జూబ్లీహిల్స్ ఓటమితో కుంగిపోయేదిఇ లేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ తన సమీప ప్రత్యర్థి బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై సుమారు 25వేల ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఈ సందర్భంగా కేటీఆర్ విలేకరులతో మాట్లాడారు. ఈ ఉప ఎన్నిక పార్టీకి కొత్త ఉత్సాహాన్ని, బలాన్ని ఇచ్చిందని రాష్ట్రంలో రాజకీయ ప్రత్యామ్నాయం బిఆర్ఎస్ మాత్రమేనని ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని అన్నారు. ఇకపైనా ప్రజా సమస్యలపై తమ పార్టీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.. మరింత బలంగా పనిచేద్దాం. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యే వరకూ శ్రమిద్దాం' అని అన్నారు వ్యక్తిగత సమస్యలు ఉన్నా, పార్టీ నాయకులు జూబ్లీహిల్స్ ఎన్నికల్లో విజయం కోసం నిర్విరామంగా పనిచేశారు. వారికి పేరు పేరునా ధన్యవాదాలు. ప్రతి బూత్‌లో స్థానిక మిగతా2లో...

# బీహార్‌లో ఎన్‌డిఎ సునామీ

(మొదటి పేజీ తరువాయి)

నిలబెట్టుకోవడానికి సిద్ధంగా ఉంది. భారతీయ జనతా పార్టీ అతిపెద్ద పార్టీగా అవతరించేందుకు రంగం సిద్ధమైంది. ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన్‌సురాజ్ పార్టీ అసలు ప్రభావం చూపలేదు. ఎంఐఎం ఐదు సీట్లను గెల్చుకోవడం విశేషం. రాహుల్ గాంధీ ఓట్ చోరీ అస్సలు పనిచేయాలేదు. బీహార్‌లో నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ సంవత్సరం బీహార్‌లో 1951 నుండి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 66.91 శాతం ఓటింగ్ నమోదైంది. బీజేపీ నేతలు కూడా ఊహించని రీతిలో బీహార్ ఫలితాలు వెలువడుతున్నాయి. సర్వేల అంచనాలు కూడా తారుమారు అవుతూ ఫలితాలు వస్తున్నాయి. ప్రస్తుతం ఎన్డీఏ కూటమి 200 మార్కు దాటి 202 నాటౌట్ దిశగా దూసుకెళ్తోంది. బీజేపీ 90 శాతం స్ట్రైక్‌రేట్‌తో దూసుకెళ్తోంది. ఎవరూ ఊహించని రీతిలో బీహారీయులు అద్భుతమైన తీర్పును ఇచ్చారు.బీహార్‌లో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. రెండు విడతలుగా పోలింగ్ జరిగింది. నవంబర్ 6, 11 తేదీల్లో ఓటింగ్ జరిగింది. ఇక నవంబర్ 11న సాయంత్రం ఎగ్జిట్ పోల్స్ వెలువడ్డాయి. ఈ ఎగ్జిట్ పోల్స్‌లో ఎన్డీఏకు దాదాపుగా 140 నుంచి 160 స్థానాలు వస్తాయని అంచనాలు వేశాయి. తీరా ఎన్నికల ఫలితాలు నాటికి అంతా రివర్స్ అయింది. సర్వే అంచనాలకు మించి ఫలితాలు వెలువడుతున్నాయి. ప్రస్తుతం ఎన్డీఏ కూటమి 201 దాటి వెళ్లిపోతుంది. విపక్ష కూటమి క్రమక్రమంగా తగ్గుకుంటూ వస్తోంది. ఆర్జేడీ కంచుకోటలో కూడా ఆ పార్టీకి వ్యతిరేక పవనాలు వీచాయి. ఎక్కడా కూడా ఆర్జేడీ ప్రభావం చూపించలేదు. ఇక కాంగ్రెస్ పరిస్థితి మరీ దారుణం. హస్తం పార్టీ ఏ మాత్రం ప్రభావం చూపించలేదు. ఓట్ల లెక్కింపు ప్రారంభమై మూడు గంటలు దాటే సమయానికి భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ 180కి పైగా స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. ఉదయం 11.30 గంటల సమయానికి ఎన్డీయే కూటమి 187 స్థానాల్లోనూ, మహాగఠ్ బంధన్ 49 స్థానాల్లోనూ ఆధిక్యంలో ఉన్నాయి. ఎన్డీయే అద్భుత ప్రదర్శన ఆ కూటమి శ్రేణుల్లో సంతోషాన్ని నింపుతోంది. బీహార్ ముఖ్యమంత్రి, నితీష్ కుమార్, ఇతర జాతీయ ప్రజాస్వామ్య కూటమి నాయకులకు ప్రధాని నరేంద్ర మోడీ తాజాగా శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో అధికార కూటమి విజయం సాధించినందుకు ఆయన అభినందించారు. ఈ 'అద్భుతమైన ప్రజల తీర్పు'తో బీహార్ ప్రజలకు సేవ చేసే శక్తి ఎన్డీఏకు లభిస్తుందని ప్రధాని పేర్కొన్నారు. ఎన్డీఏ బీహార్‌లో అన్ని రకాల అభివృద్ధిని అందించడం వల్లే ఈ అఖండ విజయం సాధ్యమైందని ప్రధాని వరుస 'ఎక్స్' పోస్టుల్లో తెలిపారు. ఈ విజయాన్ని సుపరిపాలన విజయం, అభివృద్ధి విజయం, ప్రజా సంక్షేమ స్ఫూర్తి విజయం, సామాజిక న్యాయం విజయంగా ఆయన అభివర్ణించారు. 2025 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏను చారిత్రక, అపూర్వ విజయంతో ఆశీర్వదించిన బీహార్ ప్రజలకు ఆయన తన ప్రగాఢ కృతజ్ఞతలు తెలిపారు. మహాఘటబంధన్ అబద్దాలను బహిర్గతం చేయడానికి అలుపెరుగకుండా కృషి చేసిన ఎన్డీఏ కార్యకర్తలకు కూడా ప్రధాని ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులోనూ బీహార్ అభివృద్ధి కోసం ఈ కూటమి నిరంతరం కృషి చేస్తుందని, తద్వారా ప్రతి యువతకు, మహిళకు శ్రేయస్సుతో కూడిన జీవితానికి విస్తృత అవకాశాలు లభిస్తాయని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో బీహార్ అభివృద్ధికి, అక్కడి మౌలిక సదుపాయాలకు, రాష్ట్ర సంస్కృతికి కొత్త గుర్తింపు తీసుకురావడానికి చురుకుగా పనిచేస్తామని ప్రధాని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌తో పాటు కేంద్ర మంత్రులు చిరాగ్ పాశ్వాన్, జితన్ రామ్ మాంఝీ, రాజ్యసభ ఎంపీ ఉపేంద్ర కుష్వాహాకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

# గ్లోబల్ ట్రేడ్ గేట్ వేగా విశాఖపట్నం

**విశాఖపట్టణం,నవంబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** గ్లోబల్ ట్రేడ్ గేట్ వేగా విశాఖపట్నం నిలుస్తోందని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ ఉద్ఘాటించారు. స్టీల్ ఉత్పత్తి, ఆక్వా రంగాల్లో ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందిందని అభివర్ణించారు. 2047 స్వర్ణాంధ్ర విజన్‌తో ఏపీ సాంకేతికంగా, ఆర్థికంగా బలోపేతం అవుతోందని వివరించారు. 2047 నాటికి సుసంపన్నమైన దేశంగా భారత్ అవతరిస్తుందని చెప్పుకొచ్చారు. విజనరీ సీఎం చంద్రబాబు ఉన్న ఏపీలో పుట్టిన ప్రతీ బిడ్డా అదృష్టవంతుడేనని... వారి భవిష్యత్ అంతా ఉజ్వలమైనదేనని గోయల్ వ్యాఖ్యానించారు. విశాఖపట్నంలోని సీఐఐ పెట్టుబడుల సదస్సులో పీయూష్ గోయల్ పాల్గొని ప్రసంగించారు. ఏపీ అభివృద్ధి గురించి మాత్రమే కాదని.. యావత్ భారతదేశం అభివృద్ధి గురించి సీఎం చంద్రబాబు ఆలోచిస్తారని ప్రశంసించారు. టెక్నాలజీ ద్వారా ఈ సుసంపన్నతను సాధిస్తామని పేర్కొన్నారు. టెక్నాలజీ డెమొక్రటైజేషన్ అనే విధానాన్ని పాటిస్తూ అందరికీ దానిని చేరువ చేస్తున్నామని వివరించారు. భారత్ తెచ్చిన డిజిటల్ పేమెంట్ విధానం ఇప్పుడు చాలా దేశాలు అనుసరిస్తున్నాయని తెలిపారు. 30 బిలియన్ డాలర్ల విలువైన పెట్టుబడులతో సెమీ కండక్టర్ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నా మని పీయూష్ గోయల్ వెల్లడించారు. 104 శాటిలైట్లను ఒకేసారి అంతరిక్షంలోకి పంపిన దేశంగా సాంకేతికతను ప్రజలకు దగ్గర చేస్తున్నామని నొక్కిచెప్పారు. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ఆ దిశగా పనిచేస్తున్నామని వివరించారు. ఇంజినీరింగ్ నైపుణ్యాలు ఉన్న భారత యువత ప్రపంచ వ్యాప్తంగా సేవలు అందిస్తున్నారని తెలిపారు. వసుధైక కుటుంబం అనే భారతీయ భావనను కోవిడ్ సమయంలో 110 దేశాలకు వ్యాక్సిన్ సరఫరా చేసి నిరూపించామని ఉద్ఘాటించారు. స్వేచ్ఛా వాణిజ్యం కోసం వివిధ దేశాలతో ఒప్పందాలు చేసుకుని దానికి అనుగుణంగా వాణిజ్య బంధాలను బలోపేతం చేస్తున్నామని పీయూష్ గోయల్ వివరించారు. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ దిశగా, జీఎస్టీ సంస్కరణలతో ప్రజలందరికీ ఆర్థిక అభివృద్ధి దిశగా పయనిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా భిన్నమైన పరిస్థితులు ఉన్నా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను పెద్దఎత్తున భారత్ ఆకర్షిస్తూనే ఉందని వివరించారు. అత్యంత పారదర్శకమైన విధానంలో వాణిజ్యం ఉండాలని తాము కోరుకుంటున్నామని పేర్కొన్నారు. సీఐఐ సదస్సులతో సరికొత్త పెట్టుబడులు, ఆలోచనలు, ఆవిష్కరణలు రావటం అభినందనీయమని అన్నారు. వాణిజ్య ప్రదర్శనలకు, ఎగ్జిబిషన్లు, సదస్సులకు వీలుగా ఢిల్లీలో భారత్ మండపం ఉన్నట్లే ఆంధ్రా మండపం నిర్మించడానికి తాము సిద్ధంగా ఉన్నామని పీయూష్ గోయల్ స్పష్టం చేశారు.

# జూబ్లీహిల్స్‌లో ప్రజలు విలక్షణమైన తీర్పు

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ ఎన్నికల తర్వాత హైదరాబాద్ ప్రజల్లో కాంగ్రెస్‌పై నమ్మకం పెరుగుతోందని అన్నారు. అందుకు జూబ్లీహిల్స్‌లో విజయం నిదర్శనమని, విజయం అందించిన ప్రజలకు ఈ సందర్భంగా సీఎం ధన్యవాదాలు తెలిపారు. నవీన్ యాదవ్ విజయం కోసం కృషి చేసిన పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు సరైన ఫలితాలు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనను ప్రజలు నిశితంగా పరిశీలించి తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 39శాతం ఓట్లు వచ్చాయి. 6 నెలల తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మాకు ఓట్లశాతం 42కు పెరిగింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు 51శాతం ఓట్లను ప్రజలు ఇచ్చారు. సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించారు. గెలుపోటములకు కాంగ్రెస్ పొంగిపోదు, కుంగిపోదు. ప్రజల తరఫున నిలబడటం, పోరాడటమే కాంగ్రెస్ కర్తవ్యం అని అన్నారు. రాష్ట్ర ఆదాయంలో 65శాతం వరకు హైదరాబాద్ నుంచే వస్తోంది. నగరానికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా మరింత అభివృద్ధి చేస్తాం. హైదరాబాద్‌ను సమస్యల రహిత నగరంగా తీర్చి దిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. కేంద్రం నుంచి నిధులు రాకుండా కిషన్‌రెడ్డి సహాయ నిరాకరణ చేస్తున్నారు. మెట్రో, మూసీ ప్రక్షాళన సహా అనేక ప్రాజెక్టులకు అనుమతులను అడ్డుకుంటున్నారని మరోమారు ఆరోపించారు. కిషన్‌రెడ్డి ఎంపీ నియోజకవర్గంలోనే భాజపాకు బాగా ఓట్లు తగ్గాయి. భాజపా ఓట్లు 65వేల నుంచి 17 వేలకు ఎందుకు తగ్గాయో కిషన్‌రెడ్డి ఆలోచించాలి. ఆయన వ్యవహార శైలిని ప్రజలు గమనించారు. భూ కంపానికి ముందు వచ్చే ప్రకంపనగా జూబ్లీహిల్స్ ఫలితాన్ని చూడాలన్నారు. తీరు మారకుంటే భూకంపం వంటి ఫలితాలు భాజపాకి వస్తాయని హెచ్చరించారు. రాజకీయాలు మాని.. రాష్ట్రాభివృద్ధికి కేంద్రమంత్రులు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రాజెక్టులకు అనుమతులు తెచ్చే బాధ్యత కేంద్రమంత్రులు, భాజపా ఎంపీలపై ఉంది. అసూయ తగ్గించుకోవాలని ప్రతిపక్ష నేతకు సూచిస్తున్నా. అధికారం పోయినా.. కేటీఆర్‌లో అహంకారం, అసూయ పోలేదు. పదవులు ఎవరికీ శాశ్వతం కావు. కేటీఆర్ తన అహంకారాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఉంది. మనం ఇంకా చాలా ఏళ్లు రాజకీయాలు చేయాల్సి ఉంది. ఫేక్ న్యూస్ రాయించి.. ఫేక్ సర్వేలు చేయించుకొని భ్రమలో బతకొద్దని కెటిఆర్‌కు సూచించారు. భారత రాష్ట్ర సమితి ఓడిపోతుంది.. భాజపాకు డిపాజిట్ రాదని ముందే చెప్పానని ఫలితం అలాగే వచ్చిందన్నారు. అయితే కొందరు మీడియా వారు అత్యుత్సాహంతో బిఆర్ఎస్ గెలవ బోతోందని ప్రచారం చేశారని, అది వారి విజ్ఞతకే వదిలివేస్తున్నానని అన్నారు. జూబ్లీహిల్స్‌లో మాకు మద్దతు ఇచ్చిన ఎంఐఎంకు ధన్యవాదాలని, అసదుద్దీన్ ఒవైసీ బ్రదర్స్‌కు కాంగ్రెస్ కార్యకర్తల పక్షాన ధన్యవాదాలు తెలిపారు.. ఆయా రాష్ట్రాల పరిస్థితులను బట్టి పొత్తులు, మద్దతు ఉంటుంది. బిహార్ ఫలితాలను ఇంకా నేను సమిక్షించలేదని, దానిపై తరవాత స్పందిస్తానని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై ఈనెల 17న జరిగే కేబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. కేసీఆర్ ప్రస్తుతం క్రియాశీల రాజకీయాల్లో లేరు, ఆయన ఆరోగ్యం కూడా అంతగా సహకరించడం లేదు. కేసీఆర్ గురించి ఇప్పుడు స్పందించాల్సిన అవసరం లేదన్నారు. వచ్చే పదేళ్లపాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పాలిస్తుంది.. మార్పు చేసి చూపిస్తాం అని సీఎం రేవంత్ అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో పోలైన ఓట్లలో దాదాపు 51 శాతం కాంగ్రెస్‌కి, 38 శాతం ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌కు, 8 శాతం బీజేపీకి వచ్చాయన్నారు. ఈ ఎన్నికల ఫలితాల్లో ఎవరి పాత్ర ఏంటో, ఎవరి బాధ్యత ఏమిటో ప్రజలు స్పష్టంగా చెప్పారని పేర్కొన్నారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. అనుచిత భాషతో అబద్దాలను బీఆర్ఎస్ ప్రచారం చేసిందని తెలిపారు. గంజాయి, డ్రగ్స్‌లను నియంత్రించడానికి ఈగల్ ఫోర్స్ తీసుకు వచ్చామని వివరించారు. కబ్జాలను అడ్డుకోవడానికి హైడ్రా తీసుకువచ్చామన్నారు. అయితే నగరాభివృద్ధికి బీఆర్ఎస్ సహకరించకపోగా అడ్డుపడుతోందన్నారు. తాము ఎన్నికలప్పుడే రాజకీయ విమర్శలు చేస్తామన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సచివాలయానికి రండింటూ ఆహ్వానించారు. కేంద్రంలో పెండింగ్ ఉన్న రాష్ట్ర అంశాలపై చర్చిద్దామంటూ కిషన్ రెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

# జూబ్లీహిల్స్‌లో రౌడీయిజంతో ఉప ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

భయపెట్టి ఓట్లు వేయించుకున్నారంటూ కాంగ్రెస్ పార్టీ నేతలపై ఆమె మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రిగ్గింగ్ చేసి గెలిచిందంటూ తీవ్ర విమర్శలు చేశారు. ఈ ఉప ఎన్నిక నిర్వహణలో ఎన్నికల సంఘం (ఈసీ) విఫలమైందన్నారు. కాంగ్రెస్‌ది అసలు గెలుపే కాదని.. నైతికంగా తానే గెలిచానని ఈ సందర్భంగా మాగంటి సునీత స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్.. 24, 658 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ప్రతి రౌండ్‌లోనూ కాంగ్రెస్ ఆధిక్యాన్ని ప్రదర్శించింది. ఇక ఈ ఉపఎన్నికలో బీజేపీ డిపాజిట్ గల్లంతయింది. ఏడాది జూన్ 8వ తేదీన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నేత మాగంటి గోపినాథ్ తీవ్ర అనారోగ్యంతో మరణించారు. దీంతో ఈ నియోజకవర్గం ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో నవంబర్ 11వ తేదీన ఈ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికల ఓట్ల లెక్కింపు పక్రియ శుక్రవారం అంటే.. నవంబర్ 14వ తేదీన జరిగింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ ఘన విజయం సాధించారు. ఎగ్జిట్ పోల్స్ సర్వేలో సైతం కాంగ్రెస్ పార్టీకే విజయావకాశాలు ఉన్నాయని వెల్లడించిన విషయం విదితమే. దీంతో ఓటమి చెందిన సునీత అధికార కాంగ్రెస్ తీరును తప్పుపట్టారు.

# జూబ్లీహిల్స్‌లో బిఆర్ఎస్ ఓటమి

### - కర్మ హిట్స్ బ్యాక్ అంటూ కవిత ట్వీట్

**హైదరాబాద్, నవంబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక ఫలితం వెలువడిన తర్వాత తెలంగాణ జాగృతి సంస్థ అధ్యక్షురాలు కవిత (ఐజీలతిబిఠజీ) ఎక్స్‌లో పెట్టిన పోస్టు ఆసక్తికరంగా మారింది. ' కర్మ హిట్స్ బ్యాక్' అంటూ ఆమె ట్వీట్ చేశారు. ఇవాళ వెలువడిన జూబ్లీహిల్స్ ఫలితాల్లో భారత రాష్ట్ర సమితి ఓటమి చవి చూసిన సంగతి తెలిసిందే. ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు 98,988 ఓట్లు, భారత రాష్ట్రసమితి అభ్యర్థి మాగంటి సునీతకు 74,259 ఓట్లు, భాజపా అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డికి 17,061 ఓట్లు పోలయ్యాయి.

# అభివృద్ధి, సంక్షేమంలో బాబు రోల్ మోడల్

(మొదటి పేజీ తరువాయి)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్‌ను గ్లోబల్ ఐటీ కేంద్రంగా తీర్చిదిద్దారన్నారు .30వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. ప్రధాని మోడీ నేతృత్వంలో ఆర్థికంగా సుసంపన్నమైన దేశంగా భారత్ ఎదుగుతోందన్నారు. సంపద సృష్టిస్తేనే ప్రపంచంలో పేదరిక నిర్మూలన సాధ్యం అవుతుందన్నారు. ఏపీలో సుపరిపాలన, అత్యుత్తమ విధానాలనే సీఎం చంద్రబాబు ప్రభుత్వం ఆచరిస్తోందని తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా ఏపీని అభివృద్ధి చేయడానికి అంతే శ్రద్ధ చూపిస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు సాధించడానికి చంద్రబాబు.. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను ఒప్పిస్తున్నారన్నారు. విశాఖలో నిర్వహిస్తున్న పెట్టుబడుల సదస్సు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. దేశం, రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసి పనిచేస్తున్నాయన్నారు. జీఎస్టీ సంస్కరణలు, మౌలిక సదుపాయాల కల్పన వంటివి దేశాభివృద్ధి దోహదం చేస్తున్నాయని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్, బ్లూ, అగ్రి ఎకనామి ఇలా వేర్వేరు రంగాల్లో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఏపీలో ఉన్నాయని ఉపరాష్ట్రపతి వెల్లడించారు.గవర్నెన్సు, డిజిటల్ ఇన్ ఫ్రా ద్వారా వేగంగా సేవలు అందుతున్నాయన్నారు. టెక్నాలజీ నాలెడ్జి డ్రివెన్ ఎకానమీ సాధించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయని తెలిపారు. దేశంలోనూ, ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఇదే సరైన సమయం అంటూ ఉపరాష్ట్రపతి అందరికీ పిలుపునిచ్చారు. వచ్చే రెండు మూడేళ్లలో 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలుస్తుందన్నారు. అలాగే అతిపెద్ద స్టార్టప్ ఎకో సిస్టంగానూ భారత్ ఎదుగుతుందని పేర్కొన్నారు. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పాదనతో ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధిస్తామన్నారు. ప్రతీ దేశంతోనూ భారత్ మైత్రినే కోరుకుంటుందని.. అంతా కలిసి ఎదుగుదాం అనే భావన భారతదేశానిది అని అన్నారు. ఇతరులకు నష్టం కలిగించటం కాదు, ప్రయోజనం కల్పించటం ద్వారా అభివృద్ధి సాధించాలనేది భారత్ నినాదమని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ స్పష్టం చేశారు.

# ఏపీకి గ్రోత్ కారిడార్‌గా విశాఖపట్నం అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

విశాఖపట్నంలోని సీఐఐ పెట్టుబడుల సదస్సులో మంత్రి నారా లోకేష్ పాల్గొని ప్రసంగించారు. అమరావతి నిర్మాణం, విశాఖ అభివృద్ధిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరుగులు పెట్టిస్తున్నారని ఉద్ఘాటించారు. ఏపీకి వచ్చే పెట్టుబడులకు అనుమతులు, భూములు కేటాయించి త్వరితగతిన ఉత్పత్తి దశకు చేరుకునేలా చేయూత ఇస్తున్నామని స్పష్టం చేశారు. ఏపీలో, కేంద్రంలో డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్లు ఉన్నాయని నొక్కిచెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెడితే వాటిని ప్రభుత్వ పెట్టుబడులుగా భావించి వారందరికీ అండగా నిలుస్తున్నామని మాటిచ్చారు. 2.4 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందడానికి కేంద్ర మంత్రి పీయుష్ గోయల్ సహకరిస్తున్నారని మంత్రి నారా లోకేష్, పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వంటి విజనరీ లీడర్ల నేతృత్వంలో భారతదేశం, ఆంధ్ ప్రదేశ్ అభివృద్ధి దిశగా ముందడుగు వేస్తున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. గత కొన్ని నెలలుగా ఏపీలో కీలకమైన మౌలిక సదుపాయాల కల్పన వేగంగా జరుగుతోందని ఉద్ఘాటించారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణం అవుతున్నాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఏడు ఆపరేషన్ ఎయిర్ పోర్టులు ఉన్నాయని.. కొత్తగా మరో ఏడు ఎయిర్ పోర్టులు నిర్మాణం చేస్తామని వివరించారు. ఏరోస్పేస్, ఎయిర్ క్రాఫ్ట్ తయారీని కూడా ఏపీకి తీసుకువస్తామని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# రాజకీయాల్లో గెలుపోటములు సహజం

(మొదటి పేజీ తరువాయి)

నాయకత్వం బాగా పనిచేసింది. మాగంటి సునీతకు రాజకీయ అనుభవం లేకపోయినా ఆమె ఎంతో కష్టపడ్డారు. ఒక రకంగా పోరాటమే చేశారు. గత రెండేళ్లుగా ప్రధాన ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ అద్భుతమైన పాత్ర పోషిస్తోంది. ప్రజా సమస్యలు కేంద్రంగా కొట్లాడుతున్నాం. ఈ ఎన్నికల్లో మాకు ఓటు వేసిన ప్రతి ఓటరుకు ధన్యవాదాలు తెలిపారు. 2014 నుంచి 23 మధ్య మధ్య ఏడు ఉప ఎన్నికలు జరిగాయి. అప్పటి ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ ఒక్క ఉప ఎన్నికలోనూ గెలవలేదు. మేము ఐదు గెలిచాం. రెండింటిలో ఓడిపోయాం. జీహెచ్ఎంసీ ఎన్నికలు వస్తే కూడా ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఒకట్రెండు కార్పొరేట్ సీట్లు మాత్రమే వచ్చాయి. ఈ ఎన్నికల్లో ప్రజల తరఫున వాదనను బలంగా వినిపించగలిగాం. ప్రజా సమస్యలు, ఆరు గ్యారెంటీల అమలు వైఫల్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాం. కుల, మత రాజకీయాలు, అసభ్య పదజాలం ఉపయోగించలేదు. చాలా హుందాగా పోరాటం చేశాం. ప్రజలకు అవసరమైన పాయింట్లు మాత్రమే చర్చకు పెట్టాం. పదేళ్ల ప్రభుత్వం నడిపిన ఒక జవాబుదారీ పార్టీగా జూబ్లీహిల్స్‌కు ఏం చేశారంటే. రూ.5వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశాం అని వివరించారు. జాతీయ స్థాయిలో చూస్తే బిహార్‌లో కాంగ్రెస్ ఉనికి కోల్పోయే పరిస్థితి వచ్చింది. ఈ ఎన్నిక భారత రాష్ట్ర సమితికి చిన్న సెట్ బ్యాక్ మాత్రమే. ఫలితాలను సమీక్షించుకుంటాం. ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన అవసరం కూడా ఉందన్నారు. ఓటమికి సాకులు వెతకడం లేదు. చర్చ జరగాలని కోరుకుంటున్నాం. ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయమై బెంగాల్‌లో హైకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చింది. రాష్ట్రంలో కూడా పది చోట్ల ఉపఎన్నికలు రావాల్సిందే. ఒక్క ఉప ఎన్నికకే కాంగ్రెస్ ఇన్ని ఆపసోపాలు పడింది. పది చోట్ల ఉపఎన్నికలు జరిగితే సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలను తీసుకొస్తారేమో అని కేటీఆర్ అన్నారు.

# వచ్చే ఎన్నికల్లో వందసీట్లు సాధిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను నేరవేరుస్తున్నామన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక గెలుపు కాంగ్రెస్ పాలనకు నిదర్శమని పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ కార్యకర్తల విజయమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ వరుస విజయాలు సాధిస్తోందన్నారు. వచ్చే 8 ఏండ్లు తెలంగాణలో మేమే అధికారంలో ఉంటామని ధీమా వ్యక్తం చేశారు.జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటింగ్ శాతం తక్కువ నమోదు కావడం అవ్వడం బాధాకరమన్నారు. ఓటింగ్ శాతం తగ్గడం మంచి పరిణామం కాదని అన్నారు. యువత ఓటు హక్కును వినిగించుకోలేదన్నారు. ఓటు హక్కు వినియోగించుకోవాలని.. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ఎంతో విలువైనదని తెలిపారు.జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడించేందుకు బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు అయ్యాయని ఆరోపించారు. బీఆర్ఎస్ గెలుపు కోసం బీజేపీ పని చేసిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటైనా.. కాంగ్రెస్ పార్టీ మంచి మెజార్టీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విజయం కాంగ్రెస్ కార్యకర్తలకు అంకితం ఇస్తామని ప్రకటించారు.

# ఎంఐఎం మద్దతుతోనే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం

(మొదటి పేజీ తరువాయి)

స్పందించారు. జూబ్లీహిల్స్‌లో తాము ఎప్పుడూ ఒక కార్పొరేటర్ కూడా గెలవలేదని... స్వాతంత్ర్యం వచ్చినప్పుడు నుంచి ఎప్పుడు గెలవలేదని అన్నారు. తాము ఉన్నంతలో ప్రయత్నం చేశామని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో ఓటమిని విశ్లేషించుకుంటామని అన్నారు. ఓల్డ్ సిటీలో కూడా ఏ పార్టీ గెలవదన్నారు. ప్రజా తీర్పును తాము శిరసా వహిస్తామన్నారు. ఎంఐఎం సహకరించడం వల్లే కాంగ్రెస్ పార్టీ గెలిచిందని వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ఏం చేశాడని అనుకూలంగా ఆయనకు ఓటేయాలని ప్రశ్నించారు. రెండు పార్టీలు కూడా కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాయని ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించలేదని... దీనిపై తాము ఫిర్యాదు చేస్తామన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికలపై దృష్టిపెట్టామని.. జీహెచ్ఎంసీ మేయర్ పదవి గెలుచుకోవడమే తమ లక్ష్యమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# కేటీ,జీ (KT&G) అక్రమ "ఎస్సే" సిగరెట్లపై కఠిన చట్టపరమైన చర్యలు ప్రారంభించింది

**న్యూఢిల్లీ,నవంబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):**

గ్లోబల్ బ్రాండ్ ఎస్సే (ESSE) తయారీ సంస్థ కేటీ , జీ (KT&G), భారతదేశంలో నకిలీ మరియు అక్రమంగా విక్రయించబడుతున్న ఎస్సే సిగరెట్లను అరికట్టేందుకు ప్రముఖ న్యాయ సంస్థ ఎస్.ఎస్. రాణా అండ్ కో (S.S. Rana & Co.) ను నియమించింది. ఈ న్యాయ సంస్థ మరియు కేటీ , జీ కలిసి ఢిల్లీ NCR ప్రాంతంలో అక్రమంగా ఎస్సే సిగరెట్లు విక్రయిస్తున్న వ్యాపారులు, వ్యక్తులపై ఇప్పటివరకు 130కిపైగా లీగల్ నోటీసులు జారీ చేశారు. ఈ నెల నుంచే కేటీ , జీ సంస్థ కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర మరియు హైదరాబాద్ రాష్ట్రాల్లో కూడా దేశవ్యాప్త స్థాయిలో కఠిన చర్యలు ప్రారంభించనుంది. ప్రపంచవ్యాప్తంగా వినియోగించే సిగరెట్లలో సుమారు 11.6% అక్రమమైనవే కాగా, దీని వలన ప్రభుత్వాలకు సుమారు 40.5 బిలియన్ డాలర్ల పన్ను ఆదాయం నష్టమవుతోంది. భారతదేశంలో పరిస్థితి మరింత తీవ్రమైనది దేశంలో సుమారు ఐదవ వంతు సిగరెట్లు అక్రమ లేదా స్మగ్లింగ్ ద్వారా వస్తున్నాయి.కేటీ , జీ సంస్థ, ఎస్సే బ్రాండ్ పేరు దుర్వినియోగం చేయడంపై మరియు అక్రమ వ్యాపార మార్గాల ద్వారా వస్తువులు చొరబాటుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నకిలీ ఉత్పత్తులు ప్రభుత్వ ఆరోగ్య, భద్రత ప్రమాణాలకు అనుగుణంగా ఉండవు మరియు ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయి. ఈ చర్యలపై వ్యాఖ్యానిస్తూ, కేటీ , జీ హెడ్‌క్వార్టర్స్ ఐపీ డివిజన్ డైరెక్టర్ మి. యంగ్-హూన్ కిమ్ చెప్పారు:"అక్రమ మరియు నకిలీ సిగరెట్లు భారత ఆర్థిక వ్యవస్థకు, ప్రజల ఆరోగ్యానికి మరియు వినియోగదారుల విశ్వాసానికి పెద్ద ప్రమాదం. 2022 నాటికి భారతదేశంలో అక్రమ సిగరెట్ల పరిమాణం 30.2 బిలియన్ స్టిక్స్‌కు చేరుకుంది, దీని వలన ప్రభుత్వానికి రూ.13,331 కోట్ల ఆదాయ నష్టం జరిగింది. చైనా, బ్రెజిల్ తరువాత అక్రమ సిగరెట్ల వినియోగంలో భారత్ మూడవ స్థానంలో ఉంది. కేటీ , జీ ఎస్సే బ్రాండ్ దుర్వినియోగం నిరోధించడంలో, వినియోగ దారులకు భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ఉత్పత్తులు మాత్రమే అందించడంలో కట్టుబడి ఉంది."అలాగే ఆయన తెలిపారు: "భారతదేశంలో అసలైన ఎస్సే ఉత్పత్తులపై సమాచారం కావాలను కునే వారు కేటీ ,జీ అధికారిక డిస్ట్రిబ్యూటర్ కేదారా ట్రేడింగ్ ఎల్ఎల్‌పీ (Kedara Trading LLP) ను మాత్రమే సంప్రదించాలి. ఇది భారతదేశంలో ఎస్సే ఉత్పత్తులను విక్రయించడానికి అనుమతించ బడిన ఏకైక అధికృత చానల్."**కేదారా ట్రేడింగ్ ఎల్ఎల్‌పీ ప్రతినిధి మాట్లాడుతూ చెప్పారు:** "అక్రమ మరియు నకిలీ సిగరెట్లు భారత ఆర్థిక వ్యవస్థకు, చట్ట అమలు వ్యవస్థలకు, ప్రజారోగ్యానికి తీవ్రమైన ప్రమాదం. వీటి విక్రయం ప్రభుత్వ ఆదాయాన్ని మాత్రమే కాదు, భారతీయ పొగాకు రైతుల ఆదాయాన్ని కూడా ప్రభావితం చేస్తుంది, ఎందుకంటే వీటిలో స్మగ్లింగ్ ద్వారా దిగుమతి చేసుకున్న ముడి పదార్థాలను వాడుతారు. కేటీ ,జీ అత్యంత నైతిక ప్రమాణాలను పాటిస్తూ వినియోగదారుల మరియు ప్రభుత్వ ప్రయోజనాలను రక్షించేందుకు కృషి చేస్తోంది."ఈ చర్యల్లో భాగంగా, కేటీ , జీ సంస్థ, ఈ అక్రమ కార్యకలాపాలలో పాల్గొన్న ఏ తయారీదారు, డిస్ట్రిబ్యూటర్, హోల్‌సేలర్ లేదా రిటైలర్‌పై కఠిన సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అదేవిధంగా, స్మగ్లింగ్ నెట్‌వర్క్‌లపై నిఘా ఉంచడానికి, 2025 ఫైనాన్స్ చట్టంలోని ట్రాక్-అండ్-ట్రేస్ సిస్టమ్‌కి అనుగుణంగా పర్యవేక్షణ చేయడానికి, వినియోగదారులకు అవగాహన కల్పించడానికి ప్రభుత్వ ఏజెన్సీలతో కలిసి పనిచేయ నుంది.కేటీ , జీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ తెలిపింది "వినియోగదారులు కేవలం అధికృత, ధృవీకరిం చబడిన చానల్‌ల ద్వారా మాత్రమే ఎస్సే ఉత్పత్తులను కొనుగోలు చేయాలి. అక్రమ ఉత్పత్తులు ఆరోగ్య శాఖ మార్గదర్శకాల ప్రకారం తయారు చేయబడవు మరియు ప్రాణాపాయానికి దారితీసే ప్రమాదం ఉంది. ఇలాంటి ఉత్పత్తులు తప్పనిసరి హెచ్చరిక లేబుల్‌లు లేకుండా తక్కువ ధరలకు విక్రయించ బడుతూ, వినియోగదారులను తప్పుదోవ పట్టిస్తున్నా యి." **కేటీ , జీ గురించి:** కేటీ , జీ ఒక ప్రముఖ కొరియన్ సంస్థ, ప్రపంచవ్యాప్తంగా ఎస్సే (ESSE) బ్రాండ్‌ను తయారు చేసే కంపెనీ. 2024 నాటికి, కేటీ , జీ సంస్థ 148 దేశాల్లో 870 విభిన్న బ్రాండ్‌లను విక్రయిస్తోంది.

# ఎటూరునాగారం కేజీబీవీలో విద్యార్థుల అద్భుత ప్రదర్శనలు





**ఏటూరు నాగారం, నవంబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిల్డ్రన్స్ డే సంబరాల సందర్భంగా ఎటూరునాగారం కేజీబీవీ పాఠశాలలో ఘనంగా సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. రంగోలి డ్రాయింగ్, ఎస్సే రైటింగ్, స్పీచ్, ఫిరమిడ్స్, నృత్య ప్రదర్శనలు వంటి వివిధ కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని మెరిశారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. కార్యక్రమానికి కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మడే అరుణ అధ్యక్షత వహించారు.విద్యార్థుల సృజనాత్మకత, ప్రతిభను వెలుగులోకి తీసుకువచ్చిన ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# జర్నలిస్టు కుటుంబానికి టిడబ్ల్యూజెఎఫ్ ఆర్థిక చేయుత



**పరకాల, నవంబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణానికి చెందిన జర్నలిస్టు సూదమల శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మ ృతి చెందగా టి డబ్ల్యూ జె ఎఫ్ పరకాల నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో, జర్నలిస్టు మిత్రులు ఆర్థిక సహకారం అందించి ఆదుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన టి యు డబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్ మాట్లాడుతూ జర్నలిజాన్ని వ ృత్తిగా చేసుకొన్న జర్నలిస్టులకు వ ృత్తిపరంగా గాని, ప్రభుత్వ పరంగా గాని ఎలాంటి ఆర్థిక భరోసా లభించడం లేదన్నారు. జర్నలిస్టు సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తుందన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం ద ృష్టికి తీసుకువచ్చే జర్నలిస్టులమలు దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారని అన్నారు. శ్రీనివాస లాంటి అనేక మంది జర్నలిస్టు కుటుంబాలు వారి అనంతరం ఆర్థిక భరోసా లభించకపోవడంతో పేదరికంలో మగ్గుతున్నాయి అన్నారు. ఇప్పటికై నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జర్నలిస్టు సంక్షేమం కోసం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే శ్రీనివాస్ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు టివి రాజు, ప్రధాన కార్యదర్శి అంతడుపుల శ్రీనివాస్, టిడబ్ల్యూజే అనుబంధ ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు గూడేలి నాగేంద్ర, డివిజన్ కార్యదర్శి కోకిల చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి కొల్లూరి చందు, ఉపాధ్యక్షులు ఏకు రవికుమార్, సహాయ కార్యదర్శి దొమ్మటి అంబేద్కర్,బొల్లెపెల్లి రాజు ,చుక్క సతీష్ ,ఐలి విజయ్,సిలివేరు రాజు,సిలువేరు మనోహర్, కోడెపాక దేవేందర్,ఓదెల శివకుమార్,జి.రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణకు కృషి: అదనపు డీసీపీ శ్రీనివాస్




**హన్మకొండ,నవంబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ స్వచ్ఛంద సంస్థల బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు అదనపు డీసీపీ(సి ఏ ఆర్) శ్రీనివాస్ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ పోలీస్, ఎఫ్ ఎం ఎం ఎస్ఎస్ఎస్, డాన్ బాస్కో నవజీవన్ స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో వాకథాన్ కార్యక్రమం వరంగల్ పోలీస్ కమిషనరేట్ నుండి హనుమకొండ కలెక్టరేట్ వరకు నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా అదనపు డీసీపీ (సిఏఆర్) శ్రీనివాస్ మాట్లాడుతూ బాలల పరిరక్షణ కోసం జిల్లాలో వివిధ మాధ్యమాల ద్వారా బాల్య వివాహ నివారణ, బాలల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, ముఖ్యంగా ఆన్లైన్ లైంగిక వేధింపులకు గురికాకుండా అప్రమత్త చర్యలు చేపడుతున్నట్లు తెలియ చేశారు. సైబర్ క్రైమ్ ఏసిపి గిరి కుమార్ మాట్లాడుతూ బాలల సంరక్షణకు ప్రతి ఒక్కరు విధిగా కృషి చేయాలని ముఖ్యంగా కుటుంబ వ్యవస్థలో మార్పు రావాలని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి జె. జయంతి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారుల సమన్వయం తో బాలల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారుకార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కజాంపురం దామోదర్, సందసాని రాజేంద్ర ప్రసాద్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ ఛైర్పర్సన్ అనితా రెడ్డి, సిడిపివో విశ్వజ, బాల రక్షా భవన్ కో..ఆర్డినేటర్ సీహెచ్ అవంతి, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్స్పెక్టర్ జె శ్యామ్ సుందర్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఇన్చార్జి అధికారి ఎస్ ప్రవీణ్ కుమార్, డెమో అశోక్ రెడ్డి, ఎఫ్ఎంఎం ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎర్ర శ్రీకాంత్, ప్రోగ్రాం మేనేజర్ బత్తుల కరుణ, డాన్ బాస్కో నవ జీవన్ స్వచ్ఛంద సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ పి. సంతోష్, ఎన్సి ఎల్పి డైరెక్టర్ బుర్ర అశోక్, చైల్డ్ హెల్ప్ లైన్ కో..ఆర్డినేటర్ ఎస్ భాస్కర్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం. మౌనిక, శ్రీనివాసులు సునిత చైతన్య సుజాత విజయ్ రజిత, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, ట్రైనీ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్బిట్ ఇ-టెక్నో పాఠశాలలో బాలల దినోత్సవం, స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు





**హన్మకొండ,నవంబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం, ఎల్లాపూర్ గ్రామ శివారు లోనీ ఆర్బిట్ పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవం మరియు స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్ చిట్టి రెడ్డి భగవాన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ప్రిన్సిపల్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, ఉపాధ్యాయ వృత్తి చాలా బాధ్యతాయుతమైనదని, అందరూ అనుభవించే బాల్యం, భగవంతుడు ఇచ్చిన ఓ అమూల్యమైన వరం. అభం శుభం తెలియని ఆ పసి మనసులు పూ తోటలో అప్పుడే పరిమళించిన పువ్వులు. మన స్వతంత్ర మొదటి ప్రధాని అయిన జవహర్లాల్ నెహ్రూ కి పసిపిల్లలు అంటే ఎంతో మక్కువ. అందుకు నిదర్శనంగా, అతని జన్మదినం సందర్భంగా మన దేశవ్యాప్తంగా ఈ బాలల దినోత్సవంను జరుపుకుంటున్నామని తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ను జరుపు కున్నట్లు చెప్పారు. పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులు వివిధ సబ్జెక్టుల లో ఉపాధ్యాయుల పాత్రను పోషించారు. డీఈవోగా సిహెచ్. శ్రేయన్ రెడ్డి, ఎంఈఓ గా బి. రామ్ చరణ్, ప్రిన్సిపల్ గా ఎం. సాయి కిరణ్, వైస్ ప్రిన్సిపల్ గా ఎన్. చరణ్ తేజ, డైరెక్టర్స్ గా బి. కీర్తన చేశారు. ఇందులో భాగంగా ఉపన్యాస పోటీలు మరియు సాంస్కృతిక కళా కార్యక్రమములను జరిపినట్లు మరియు ఈ ఉపాధ్యాయ పాత్రలో ఉత్తములుగా పనిచేసిన వారికి ప్రధానోపాధ్యాయులు డైరెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అలాగే పాఠశాల డైరెక్టర్ సిహెచ్. హారిక భగవాన్ రెడ్డి, అకాడమిక్ ఇంచార్జ్ వాసుదేవ రెడ్డి, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు మధుకర్, సారంగపాణి, జావిద్ ఖాన్, వెంకటేష్, రాజేష్, రాహుల్ రాజ్, అశోక్ రెడ్డి, మహేష్, అశోక్, చంద్రమోహన్, మురళీకృష్ణ, ప్రశాంత్, శ్రీనివాస్, సాయి కళ్యాణ్, అబ్దుల్ ఖాన్, కళ్యాణి, వహీదా బేగం, షర్మిల, స్వర్ణలత, రసజ్ఞ, రూపాదేవి, శ్వేతా రెడ్డి, శ్వేత, ప్రవళిక, రజిత, రాధిక, కళ్యాణి మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# "కలివివనం" సినిమా పోస్టర్ ఆవిష్కరణ






**హన్మకొండ,నవంబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** 66వ డివిజన్ కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ ఉన్నత పాఠశాల హసన్ పర్తి యందు" కలివివనం" సినిమా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం పాఠశాల ప్రిన్సిపాల్ ఆకుతోట శాంత రామ్ కర్ణ అధ్యక్షతన నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 66 వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ నేతాజీ శిశు మందిర్ కరస్పాండెంట్ వలస జ్ఞానేశ్వర్ ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ అధ్యక్షులు నాగేశ్వరరావు కార్యదర్శి శ్యాంసుందర్ సభ్యులు రవిబాబు లు మరియు చిత్ర దర్శకులు రాజ్ నరేందర్ బాల నటులు చిత్ర యూనిట్ బృందం మొత్తం పాల్గొనడం జరిగినది. చిత్ర దర్శకులు రాజ్ నరేందర్ మాట్లాడుతూ సుజాత విద్యా నికేతన్ పాఠశాల గత 30 సంవత్సరాలుగా పర్యావరణ మిత్ర యూనిట్ ఆధ్వర్యంలో చేస్తున్న పర్యావరణ పరి రక్షణ కృషికి అనేక జాతీయ రాష్ట్ర జిల్లా స్థాయి అవార్డులు సాధించి నందున మా సినిమా కూడా పర్యావరణ పరిరక్షణకు భవిష్యత్తు తరాలకు అందమైన ప్రకృతిని అందించాలని లక్ష్యంతో "కలివివనం" సినిమా తీయడం జరిగినదని ఈ సినిమా పోస్టర్ ఆవిష్కరణకు పర్యా వరణహిత సుజాత విద్యా నికేతన్ పాఠశాల వేదిక కావడం ఆనందంగా ఉందని అందుకు అవకాశం కల్పించిన ప్రిన్సిపాల్ ఆకుతోట శాంతరాం కన్నకి ధన్యవాదాలు తెలుపుతూ ఈ సినిమా ఈనెల 21న విడుదల అవుతుందని అందరూ తప్పక ఈ సినిమాను చూసి ప్రోత్సహించాలని తద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని తెలిపినారు డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ మాట్లాడుతూ ఈ సినిమా మిగతా సినిమాలకు భిన్నంగా పర్యావరణం పై తీయడం చాలా హర్షనీయమని ఈరోజుల్లో మానవ స్వార్థానికి అడవులు అంతరించి మానవ మనుగడ ప్రమాదంలో ఉందని ఈ సినిమా విజయవంతం కావడానికి కృషి చేస్తామని తెలిపినారు ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ కార్యదర్శి శ్యామ్ సుందర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ఈ సినిమా తీయడం గొప్ప సాహసమని ఇందుకు చిత్ర దర్శకులు రాజ్ నరేంద్ర అభినందనీయులని ఈ సినిమా విజయవంతం మా ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సభ్యులందరము కృషి చేస్తామని తెలిపినారు ప్రిన్సిపాల్ ఆకుతోటి శాంతారాం కర్ణ మాట్లాడుతూ మా పాఠశాల వేదికపై అనేక మంది ప్రముఖులు ఆశీనులైనారని అందులో సినిమా నటులు అసిస్టెంట్ డైరెక్టర్లు ఉన్నారని కానీ ఈ బాలల దినోత్సవం రోజు బాల నటీనటులతో తీసిన కలివివనం సినిమా దర్శకులు అందులో నటించిన బాల నటులు చిత్ర బృందం ఆ పాఠశాలకు రావడం ఇదే మొదటి సారి అని ఈ సినిమా విజయవంతనికి శాయశక్తుగా కృషి చేస్తామని తెలిపినారు అనంతరము ముఖ్య అతిథులు నటీనటులు దర్శకులు కలివివనం సినిమా పోస్టర్ను ఆవిష్కరించడం జరిగినది ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ గూడూరు లక్ష్మీనారాయణ ఉపాధ్యాయులు జూపాక నాగరాజు ఏ వెంకట్ వెంకటేశ్వర్లు అచ్యుత్ ప్రవీణ్ రాధాకుమారి సబిహా వేగం అరుణ సిహెచ్ సుచిత్ర సిహెచ్ సంధ్య జీ సంధ్య సరిత లావణ్య మౌనిక ప్రవళిక గీత సుధారాణి దేవిక దివ్య పాల్గొన్నారు.

## కరీంనగర్ జిల్లా - 47వ డివిజన్, అమెర్ నగర్‌లో నల్ల లీకేజీతో ప్రజలు ఇబ్బందులు





**కరీంనగర్ టౌన్ నవంబర్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లాలోని 47వ డివిజన్, అమెర్ నగర్‌లో గత మూడు నెలలుగా మున్సిపల్ మంచినీటి పైప్‌లైన్ లీకేజీ సమస్య తీవ్రంగా ఉండడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారత్ పెట్రోల్ పంప్ ముందు ప్రధాన పైప్‌లో లీకేజీ కారణంగా నీరు రోడ్లపై వృథాగా పారిపోగా, ఇళ్లకు సరైన ఒత్తిడితో మంచినీరు అందడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.లీకేజీ విషయాన్ని పలు మార్లు మున్సిపల్ అధికారులకు తెలియజేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని, అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని నివాసితులు డిమాండ్ చేస్తున్నారు.

## విజయ డెయిరీని సందర్శించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్





**హన్మకొండ,నవంబర్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ అలంకార్ జంక్షన్ సమీపం లోని విజయ పాల డెయిరీని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా డెయిరీ లో ఉన్న మిషనరీ, కోల్డ్ స్టోరేజ్ రూమ్ ను కలెక్టర్ పరిశీలించారు. డెయిరీలో ప్రస్తుతం ఉన్న మిషనరీ పనితీరు, పాలు, పాల ఉత్పత్తుల గురించి విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రవణ్ కుమార్ జిల్లా కలెక్టర్ కు వివరించారు. ప్రస్తుతం 15 వేల లీటర్ల కెపాసిటీతో డెయిరీ నడుస్తుందని, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పాల సేకరణ చేపడుతున్నామని, పదివేల లీటర్ల విజయ డెయిరీ పాలను మార్కెట్లో విక్రయిస్తున్నామని, 7500 లీటర్ల పాలను ప్రభుత్వ హాస్టళ్లకు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. పెరుగు, పాల నాణ్యతకు సంబంధించిన తనిఖీల ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. డెయిరీ ప్లాంట్ లో ఆధునిక టెక్నాలజీ తో నడిచే మిషనరీ కోసం నిధులు కేటాయించాలని డిడి శ్రవణ్ కుమార్ కలెక్టర్ ను కోరారు. డెయిరీ అభివృద్ధికి, నూతన మిషనరీ ఏర్పాటుకు విడతల వారీగా నిధులను కేటాయించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా డెయిరీ అధికారులు పాల్గొన్నారు.

## అంబరాన్ని అంటిన కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



**సత్తుపల్లి, నవంబర్ 14 (పీసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం జిల్లా, సత్తుపల్లి పట్టణంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు అంబరాన్నంటాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ 24 వేల ఓట్ల మెజార్టీతో గెలిచిన సందర్భంగా శుక్రవారం సత్తుపల్లి బస్టాండ్ రింగ్ సెంటర్లో కాంగ్రెస్ శ్రేణులు బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేసి స్వీట్స్ పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, సత్తుపల్లి మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ జూబ్లీహిల్స్ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపుపై నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబరాలు...

- బ్యాండ్ కొట్టి,టపాసులు కాల్చి,స్వీట్లు పంచి కార్యకర్తలతో కలిసి డ్యాన్స్ చేసిన సుడా చైర్మన్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి.
- రాబోయే అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇదే రిజల్ట్ ఉంటుందన్న సుడా చైర్మన్.
- జూబ్లీ హిల్స్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులకు,జూబ్లీ హిల్స్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన సుడా చైర్మన్...







**కరీంనగర్,నవంబర్14(పీసీడబ్ల్యూ న్యూస్):** జూబ్లీ హిల్స్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలిచినందుకు నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరా చౌక్ వద్ద సంబరాలు జరిపారు.సంబరాలలో పాల్గొన్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి బ్యాండు కొట్టి,టపాసులు కాల్చి, స్వీట్లు పంచి కార్యకర్తలు నాయకులతో కలిసి డ్యాన్స్ చేశారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమానికి జూబ్లీ హిల్స్ ప్రజలు పట్టం కట్టారని రాబోయే రోజుల్లో నగరపాలికలతో పాటు అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇదే రిజల్టు ఉంటుందని అన్నారు.టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ విజయదుందుభి మోగిస్తోందని కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుండి మంత్రులు శ్రీధర్ బాబు,పొన్నం ప్రభాకర్,లక్ష్మణ్ కుమార్ మరియు ముఖ్యనాయకుల ఆధ్వర్యంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుండి జూబ్లీ హిల్స్ లో పని చేసిన కాంగ్రెస్ నాయకులకు కార్యకర్తలకు నరేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.సంబరాలలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు బ్యాండ్ వాయిస్తూ నినాదాలు చేస్తూ ఉత్సాహంతో డ్యాన్స్ చేస్తూ సంబరాలు జరిపారు.

## 50 పడకల ఆస్పత్రి నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన...



**మానకొండూరు,నవంబర్14(పీసీడబ్ల్యూ న్యూస్):** మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నూతనంగా నిర్మించనున్న 50 పడకల ఆస్పత్రి నిర్మాణం పనులకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం శంకుస్థాపన చేశారు. శిలాఫలకం ఆవిష్కరించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోగల ఆరు పడకల స్థాయిని 50 పడకలకు పెంచేందుకు చేసిన కృషి ఫలితంగానే 17.50 కోట్ల మంజూరైనట్టు చెప్పారు. నిర్దేశిత గడువులోగా ఆస్పత్రిని నిర్మించుకోగలిగితే ప్రజలు సత్వరమే మెరుగైన వైద్య సేవలు పొందగలుగుతారని చెప్పారు. ప్రభుత్వ వైద్యానికి గ్రామీణులకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదని చెప్పారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాల్లో అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచుతోందన్నారు. అంతేకాకుండా ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతులు మెరుగుపరుస్తున్నదని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకట రమణ, ఉప వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రాజగోపాల్, టీజీఎమ్మెస్ ఐడీసీ కార్యనిర్వాహక ఇంజినీర్ విశ్వప్రసాద్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సల్మాన్, ఎంపీడీవో వరలక్ష్మి, తహసీల్దార్ విజయ్ కుమార్, ఉప తహసీల్దార్ సమ్మయ్య, అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ రేమిడి తిరుమల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, బండి మల్లేశం, ఆర్.తిరుపతి, తాళ్లపల్లి నరేశ్, మడుపు ప్రేమ్ కుమార్, వాల అంజిత్ రావు, బోళ్ల మురళీధర్, కనకం కుమార్, కోంద్ర సురేష్, ఇర్ఫాన్, రాకేష్, సహదేవ్, దూలం దేవేంద్ర, రొంటాల లక్ష్మారెడ్డి, గొల్లెన కొమురయ్య, సాయిరి దేవయ్య, శ్రీనివాస్ గౌడ్, చెలికాని సదయ్య, మీస సత్యనారాయణ, వరహాల చారి, బుర్ర శ్రీకాంత్, ఎన్.బాపురావు, గుజ్జె ప్రభాకర్, మహేందర్, బుర్ర చంద్రాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నవీన్ యాదవ్ గెలుపు సంబరాలు...





**కరీంనగర్ టౌన్ నవంబర్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** ఈరోజు కరీంనగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ జిల్లా వారి ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచినటువంటి అభ్యర్థి ఉద్యమకారుల మద్దతుతో బిసి సంఘాల మద్దతుతో సంపద వర్గాల ఆశీస్సులతో ఈరోజు గెలవడం ప్రజాస్వామ్యం గెలిచిందని భావిస్తున్నాం అదేవిధంగా అన్ని వర్గాల ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటూ ఉద్యమకారులకు ఇచ్చినటువంటి హామీలు ఉద్యమకారులకు ఇచ్చినటువంటి హామీలు, బీసీ సంఘాలకు ఇచ్చినటువంటి హామీలు తప్పకుండా నెరవేర్చి భవిష్యత్తులో మంచి స్థాయిలో ఉండాలని ఉద్యమకారుల పక్షాన వారికి శుభాకాంక్షలు తెలపడం జరిగింది,ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ జిల్లా చైర్మన్ కుమారస్వామి, ఉత్తర తెలంగాణ మహిళా అధ్యక్షురాలు ఐల ప్రసన్న, కరీంనగర్ టౌన్ అధ్యక్షులు గుడిసెల రమేష్, కారుపాకలమున్న టౌన్ మహిళా అధ్యక్షురాలు గరిక కోటేశ్వర్, అంజలి, కాశిపాక గౌరీ, విజయ, బెజ్జంకి రాజమ్మ, మొగిలి భాగ్య, సిరిసేటి భాగ్య, మల్లేశం, కనక లక్ష్మి, గాలి రమేష్, యాదవ్, పూనమల మల్లేష్, బూడిద వినోద్ కుమార్, మహమ్మద్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి కుటుంబానికి టేమ్రిస్ టీచర్స్, సిబ్బంది ఆర్థికసాయం...



**కరీంనగర్ రూరల్,నవంబర్14(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ గ్రామ శివారులోని మైనారిటీ గురుకుల పాఠశాల కరీంనగర్ బాలుర-3లో ఇంటర్ చదువుతున్న నదీమోద్దీన్ అనే విద్యార్థి ఇటీవలే ప్రమాదవశత్తు లారీ డీకొని రోడ్డు ప్రమాదంలో మరణించిన నేపథ్యంలో శుక్రవారం బాలల దినోత్సవం రోజున సదరు విద్యార్థి కుటుంబానికి కరీంనగర్ బాయ్స్-3 కళాశాల తరుపున ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందని ప్రిన్సిపాల్ పోరండ్ల చంద్రమోహన్ తెలిపారు. ఈ ఆర్థిక సాయం అందించడంలో కరీంనగర్ బాయ్స్-3తో పాటు కరీంనగర్ బాయ్స్- 1, కరీంనగర్ బాయ్స్ - 2, కరీంనగర్ గర్ల్స్ -2, సిరిసిల్ల గర్ల్స్ కళాశాలలోని ప్రిన్సిపాల్స్ మరియు ఉపాధ్యాయులు కలిసి 150000 (ఒక లక్ష యాభై వేలు) రూపాయలను సమీకరించి బాయ్స్-3 ప్రిన్సిపాల్ పోరండ్ల చంద్రమోహన్, బాయ్స్- 1 ప్రిన్సిపాల్ మహేష్, బాయ్స్ -2 ప్రిన్సిపాల్ సురేష్, విజిలెన్స్ అధికారులు అక్రమ్ పాషా, ఇంతియాజ్ ఖాన్ కలిసి మృతి చెందిన విద్యార్థి నదీమోద్దీన్ చెల్లెలికి అందచేశారు. తమ కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ కు, ఉపాధ్యాయ బృందానికి నదీమోద్దీన్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మానవతా దృక్పథంతో ఆలోచించి మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి రెండు దన్నుగా నిలవడానికి అహర్నిశలు కృషిచేసి, తమకు తోచినంతగా ఆర్థిక సాయం అందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచిన కరీంనగర్ జిల్లా శాఖ టేమ్రిస్ ఉపాధ్యాయ బృందానికి సిబ్బందిని ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అభినందించారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల లక్ష్యం పూర్తి చేయాలి...

- అధికారులకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి ఆదేశం.



**తిమ్మాపూర్,నవంబర్14(పీసీడబ్ల్యూ న్యూస్):** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని మానకొండూర్ ఎమ్మెల్య డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఎల్ఎండీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై వివిధ శాఖల అధికారులపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మానకొండూర్ నియోజకవర్గం పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల ప్రగతిని మండలాల వారీగా సమీక్షించారు. పనుల్లో జరుగుతున్న జాప్యంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జరిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. గ్రేడింగ్ పూర్తయిన ఇళ్లను వెంటనే ప్రారంభించి లబ్ధిదారులకు అందించాలని అధికారులను ఆదేశించారు. పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, ఇళ్ల నిర్మాణాల దశల ప్రకారం లబ్ధిదారుల ఖాతాల్లో బిల్లులు జమ చేయాలన్నారు. సాంకేతిక సమస్యలేవైనా ఉంటే వెంటనే వాటిని పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు.ఈ సమావేశం లో తహసీల్దార్లు టి.నరేందర్ గన్నేరువరం, ఎంఏ ఫారుఖ్ (ఇల్లంతకుంట), కె.శ్రీకాంత్ (బెజ్జంకి), ఎంపీడీలు వరలక్ష్మి, ఎన్.ఆర్.మల్హోత్ర, ఏ.శ్రీనివాస్, కె.ప్రవీణ్, వై.శశికళ, మానకొండూర్, శంకరపట్నం మండలాల డెప్యూటీ తహసీల్దార్లు ఎం.సమ్మయ్య, కె.పార్థసారథి, గృహనిర్మాణ సంస్థ సిద్దిపేట జిల్లా పీడీ టి.శ్రీనివాస్, డిప్యూటీ ఈఈలు శంకర్, కె.ముజాఫరుద్దీన్,ఎం.రవళి,పి.శ్రీజా, డి.మహేశ్, కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి వరం...

- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి...





**మానకొండూరు,నవంబర్14(పీసీడబ్ల్యూ న్యూస్):** నిరుపేదలను ఆదుకునేందుకే కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తున్నదని మానకొండూర్ నే ఉద్దేశంతోనే కళ్యాణలక్ష్మి కింద ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు. శుక్రవారం మానకొండూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 70 మందికి కళ్యాణలక్ష్మి,షాదీముబారక్, 35 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లు వరంలాంటివన్నారు. ఆడ బిడ్డల పెళ్లిళ్లు భారంగా మారిన పరిస్థితుల్లో ఈ పథకాల ద్వారా అందించే సాయం వారి ఎంతో మేలుచేకూరుస్తుందన్నారు.అలాగే ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించుకొని ఆర్థికంగా ఇబ్బందిపడుతున్న వారికి చేయూతనిందించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆర్థిక సహాయం అందిస్తున్నదన్నారు. ఆయా వర్గాల వారికి అందించే ప్రభుత్వ పథకాల వినియోగించుకోవడం ద్వారా లబ్ధి పొందాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మానకొండూర్ తహసీల్దార్, డెప్యూటీ తహసీల్దార్ సమ్మయ్య,ఎంపీడీవో వరలక్ష్మి, మానకొండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్రి ఓదెలు యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, బండి మల్లేశం, ఆర్.తిరుపతి, తాళ్లపల్లి నరేశ్, మడుపు ప్రేమ్ కుమార్, వాల అంజిత్ రావు, బోళ్ల మురళీధర్, కనకం కుమార్, కోంద్ర సురేష్, ఇర్ఫాన్, రాకేష్, సహదేవ్, దూలం దేవేంద్ర, రొంటాల లక్ష్మారెడ్డి, గొల్లెన కొమురయ్య,సాయిరి దేవయ్య, శ్రీనివాస్ గౌడ్, చెలికాని సదయ్య, మీస సత్యనారాయణ, వరహాల చారి, బుర్ర శ్రీకాంత్, ఎన్.బాపురావు, గుజ్జె ప్రభాకర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మొదలైన 25వ మండల పూజ మహోత్సవ వేడుకలు

**- శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రజతోత్సవ వేడుకలు**

**- వరంగల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం ప్రారంభం**

**- ప్రారంబించిన ట్రస్ట్ చైర్మన్ సింగిరికొండ మాధవశంకర్ గుప్తా,ట్రస్ట్ సభ్యులు**







**నర్సంపేట, నవంబర్ 14(పీసీడబ్ల్యూ న్యూస్):** వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో శుక్రవారం 25 వ మండల పూజ మహోత్సవ రజతోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి .శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 25 వ (పంచవింశతి) మండల పూజ సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుగుతున్న నేపథ్యంలో దేవాలయంలో మహాగణపతి హెూమంతో మొదలైన పూజలు ఓంకార ధ్వజారోహణ గోపూజ,సుదర్శనహెూమం ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం వరంగల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం ప్రారంభం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దేవాలయం ట్రస్ట్ చైర్మన్ ట్రస్ట్ చైర్మన్ సింగిరికొండ మాధవశంకర్ గుప్తా, అధ్యక్షుడు సైఫా సురేష్ మాట్లాడుతూ తెలంగాణలో మినీ శబరిమలైగా నర్సంపేట అయ్యప్ప దేవాలయం మారుతున్నదని పేర్కొన్నారు. శబరిమలై తలపించే విధంగా 3 కోట్ల నిధుల దాతల సహకారంతో దేవాలయం అభివృద్ధి సుదరీకృతం అవుతున్నదని తెలిపారు. దీక్ష సమయంలో ఇరుముడి సమర్పించే భక్తులకు ప్రత్యేక వసతుల ఏర్పాట్లు చేసినట్లు వారు వివరించారు. 2000 లో ప్రతిష్టించిన దేవాలయం నేడు సిల్వర్ జూబ్లీ మహోత్సవ వేడుకలు ప్రారంభం కావడం ఈ ప్రాంతానికి మరింత భక్తిభావం మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. శబరిమలైలో జరిగే విధంగా నర్సంపేట శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో శాస్త్రోత్తంగా పూజల నిర్వహణ జరుగుతున్నదని వివరించారు. దేవాలయంలో సుబ్రమణ్య స్వామి షష్టి పూజలు నిర్వహణ ఉంటుందని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతీ నెల ఉత్తర నక్షత్రం నాడు పడిపూజ కార్యక్రమం నిర్వహణ జరుగుతున్నదని వారు తెలిపారు. మండల పూజల ప్రారంభం నుండి మొదలై ఈ నెల 15 ఉత్తర నక్షత్ర పడిపూజ,22 న పుష్పాభిషేకం, పడిపూజ,డిసెంబర్ 1,2,4,6 తేదీలలో దేవాలయ స్థల,ఇతర దాతలతో పడిపూజల నిర్వహణ,డిసెంబర్ 8 న గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పల్లివేట కార్యక్రమం ఉంటుందన్నారు. 9 వ తేదీన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే,వరంగల్ జిల్లా మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ దంపతులతో మాదన్నపేట చెరువు వద్ద అయ్యప్పస్వామి పంబా ఆరాట్ మహోత్సవం, పంబాసద్ది మహా అన్నదాన కార్యక్రమం,పడిపూజ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. 12 న పడిపూజ,సిల్వర్ జూబ్లీ మహోత్సవాలలో భాగంగా ప్రత్యేక పూజల్లో 16 న సహస్ర కలిశాభిషేకాల మహోత్సవం,17 న హరిహర సహిత,సుబ్రమణ్యస్వామి, శాస్తా సహిత సువత్సల ఆంజనేయస్వామి దేవతామూర్తుల కళ్యాణ మహోత్సవాలు,18 స్థల దాతలతో పడిపూజ కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అయ్యప్పస్వామి 27 న పుష్పాభీషేకం,పడిపూజ, మండల పూజలు ముగింపు కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. అలాగే 2026 జనవరి 1 న పరకాల ఎమ్మెల్యే రేవూరి సునంద ప్రకాష్ రెడ్డితో పడిపూజ,మహా అన్నదాన కార్యక్రమం ఉంటుందని ట్రస్ట్ చైర్మన్ ట్రస్ట్ చైర్మన్ సింగిరికొండ మాధవశంకర్ గుప్తా, అధ్యక్షుడు సైఫా సురేష్ తెలిపారు.

**జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం..** శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో శుక్రవారం 25 వ మండల పూజ మహోత్సవ రజతోత్సవ వేడుకలలో భాగంగా నిర్వహిస్తున్న మహా అన్నదాన కార్యక్రమం వరంగల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం జరుగగా జిల్లా అధ్యక్షులు గోనెల రవీందర్, కార్యదర్శి బూరల సత్యనారాయణ కోశాధికారి ఇరుకు కోటేశ్వర రావు రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవునూరి అంజయ్య హాజరై ట్రస్ట్ సభ్యులలో కలిసి ప్రారంభం చేశారు. జిల్లా అధ్యక్షుడు గోనెల రవీందర్ మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా అన్నదాన కార్యక్రమానికి 11 క్వింటాల బియ్యాన్ని అందిస్తున్నట్లు ప్రకటించారు.

**మహా అన్నదానానికి లక్ష రూపాయల విరాళం.** మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో శ్రీ ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి సేవా చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ సభ్యులు, దేవాలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షులు మాదారపు చంద్రశేఖర్ గుప్తా ఒక లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమాలలో ట్రస్ట్ కార్యదర్శి చింతల కమలాకర్ రెడ్డి కోశాధికారి దొడ్డ రవీందర్,ఉపాధ్యక్షులు ఇరుకు కోటేశ్వర్ రావు పబ్బా రమేష్, అనంతుల రాంనారాయణ, శ్రీరాముల శంకరయ్య, చక్ల కృష్ణమూర్తి పాలకుర్తి శ్రీనివాస్,వజినపల్లి శ్రీనివాస్, బొద్దుల దివాకర్, తక్కల్లపల్లి యుగంధర్ రావు, బండారిపల్లి చెంచారావు, కోమండ్ల గోపాల్ రావు,గండు రవి,దొడ్డ వేణు,ప్రతాపని శ్రీకాంత్,నర్సంపేట డివిజన్ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గంధం నరేందర్ కార్యదర్శి సింగరికొండ మాధవ శంకర్, కోశాధికారి కురంగండ్ల రవి,తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఘన విజయంతో సంబరాలు

**- అశోక్ నగర్ గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు**





**ఖానాపూర్ నవంబర్ 14, (పీసీడబ్ల్యూ న్యూస్):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఘన విజయం సాధించడంతో ఖానాపూర్ మండలం అశోకనగర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సమీపంలో మరియు బస్ స్టాండ్ సెంటర్ లో గ్రామ పార్టీ అధ్యక్షులు జాడి అచ్యుత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శ్రేణులుటపాసులు కాల్చి నవీన్ యాదవ్ గెలుపు పట్ల హర్షద్వనాలు చేస్తూ విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గెట్టి సారంగపాణి మండల పార్టీ ఉపాధ్యక్షులు ఇరుకు ప్రభాకర్ రావు గ్రామ పార్టీ ఉపాధ్యక్షులు మూసుకు మోహన్ రెడ్డి మాజీ వార్డ్ మెంబర్ పొనుగోటి ప్రవీణ్ రావు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గోనెల మురళి గ్రామ పార్టీ కార్యదర్శి కర్ల రాజేందర్ ఇరుపా లక్ష్మణ్ బుడిగ కొమురయ్య యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దొడ్ల మురళి వజ్జ శ్రావణ్ ఆలకుంట రాజు వడపల్లి రాజు ఇరుకు మురళి బండోస్ అశోక్ జాడి రాజు రాశారా రమేష్ బూడిద వెంకన్న రాకేష్ తొగర్ ఐలయ్య యూత్ నాయకులు వట్టం సతీష్ నడిపల్లి భరత్ జాడి కిరణ్ కాదుర ఉప్పలయ్య భూపతి శంకరయ్య కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ప్రణాళిక ప్రకారం దాన్యం కొనుగోళ్ల కేంద్రాలు నిర్వహించాలి

**ప్రత్యేక అధికారులు క్రమం తప్పకుండా ధాన్యం కేంద్రాలను, వసతి గృహాలను పరిశీలించాలి**

**జిల్లా కలెక్టర్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ పేర్కొన్నారు.**





**తొర్రూర్ ప్రతినిధి, నవంబర్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లాలో ప్రణాళిక ప్రకారం దాన్యం కొనుగోల్ల కేంద్రాలు నిర్వహించాలనీ, ప్రత్యేక అధికారులు క్రమం తప్పకుండా ధాన్యం కేంద్రాలను, వసతి గృహాలను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. శుక్రవారం జిల్లా స్థాయి, ప్రత్యేక అధికారులు, తహసిల్దారులు, వ్యవసాయ, సహకార, అన్ని విభాగాల అధికారులు,ఎంపీడీవోలు లతో జిల్లా ప్రణాళిక, ధాన్యం కొనుగోళ్ళ కేంద్రాల నిర్వహణ, అన్ని సంక్షేమ వసతి గృహాల నిర్వహణ తదితర అంశాలపై ప్రత్యేక టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు, ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసంగిస్తూ మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటికె ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రక్రియ సజావుగా ముందుకు తీసుకు వెళ్లేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని సూచించారు, ప్రభుత్వం సూచించిన ప్రకారం జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలు, ఐకెపి, గిరిజన కార్పొరేషన్, డిఆర్డిఏ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించినా సందర్భంలో కేంద్రాలలో అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని మండలాలలో పర్యటించినప్పుడు ధాన్యం కొనుగోళ్ళ కేంద్రాలు, అన్ని సంక్షేమ వసతి గృహాల పర్యటన, పరిశీలన తప్పకుండా చెయ్యాలని, వసతి గృహాల లో ప్రస్తుత శీతాకాల నేపథ్యంలో విద్యార్థిని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యాసంస్థలలో పిల్లల యొక్క మానసిక స్థితిగతులపై దృష్టి పెట్టాలని వారికి అవసరం ఉన్నచోట మానసిక వైద్య నిపుణుల చేత కౌన్సెలింగ్ ఇప్పించాలని, విద్య క్రీడలు తదితర అంశాలలో ప్రావీణ్యం కల్పించే విధంగా విద్యాబోధనలు అందించాలని సూచించారు, హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్ ల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్క ఉద్యోగి వారి పరిధిలో షెడ్యూలు ప్రకారం క్రమం తప్పకుండా విధిగా కేటాయించిన విధులను నిర్వర్తించాలన్నారు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అధికారులు, తహసిల్దారులు, సంబంధిత సిబ్బంది ధాన్యం కొనుగోలు కేంద్రాలు, వసతి గృహాల పరిశీలన చేయాలని ఆదేశించారు. పూర్తి స్థాయిలో పక్కా ప్రణాళిక ప్రకారం అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో ధాన్యం కొనుగోల కేంద్రాల విజయవంతం చేయుటకు సిద్ధంగా ఉండాలని ఆయన ఆదేశించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్, తొర్రూరు మండలం వెలికట్టే, అమ్మాపురం లలో ఏర్పాటుచేసిన కేంద్రాలను పరిశీలించారు, వెలికట్టులో తేమ వచ్చి మిల్లులకు తరలించే ధాన్యాన్ని స్వయంగా పరిశీలించారు,

## మోదీ నాయకత్వాన్నే దేశం కోరుకుంటోంది



**నర్సంపేట నవంబర్ 14(పీసీడబ్ల్యూ న్యూస్):** నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్, రూరల్ అధ్యక్షులు తనుగుల అంబేడ్కర్ భారతీయ జనతా పార్టీ నర్సంపేట పట్టణంలోని వరంగల్ రోడ్ సర్కిల్లో బిజెపి ఆధ్వర్యంలో టపాసులు కాల్చి మిఠాయి పంచిన పార్టీ నాయకులు అనంతరం వారుపార్టీ నాయకులు అనంతరం అధ్యక్షులు మాట్లాడుతూ. ఇది బీహార్ ప్రజల విజయం ప్రధానమంత్రి నరేంద్రమోడీ జీ నాయకత్వంపై, కేంద్ర మంత్రివర్యులు అమిత్ షా జీ వ్యూహాత్మక మార్గదర్శకత్వంపై, అధ్యక్షుడు జేపీనడ్డ జీ మరియు బీహార్ యూనిట్ రూపొందించిన సంస్థాగత బలంపై ప్రజలు తమ విశ్వాసాన్ని కొనసాగిస్తున్నారని ఇది స్పష్టమైన సంకేతం అని అన్నారు. ఈ ఫలితం నిజంగా ప్రతిధ్వనించే వాటిని చూపిస్తుంది: స్థిరమైన పాలన, కనిపించే అభివృద్ధి మరియు అవకాశాన్ని విభజించకుండా విస్తరించే రాజకీయాలకు ఈ విజయం నాంది పలికింది. 2025 విధానసభ ఎన్నికల్లో ఈ చారిత్రాత్మక తీర్పు కోసం బీహార్ ప్రజలకు నర్సంపేట భారతీయ జనతా పార్టీ తరపున ప్రత్యేకమైన శుభాకాంక్షలు తెలియజేస్తూ. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కూనమల్ల పృథ్వీరాజ్,గాధగోని అనిల్, గోలి యుగేందర్,పొనుగొటి రవీంద్ర చారి, యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కొంకిస విగ్నేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కందికొండ శ్రీనివాస్ సూత్రపు సరిత కందికొండ శ్రీనివాస్ సూత్రపు సరిత,బట్టు మదన్, ఉపాధ్యక్షులు ఠాకూర్ విజయ్ సింగ్ కాసుల నాగేంద్రబాబు కార్యదర్శిలు చేను నరేష్,అశోక్,మాస్ శివ, శోభన్ బాబు, పురాని దేవేందర్,దొంతరాబోయిన రమేష్,నర్సయ్య యువమోర్చా జిల్లా నాయకులు చిలువేరు అన్వేష్,కుసుమ భవాని శంకర్, నర్సంపేట పట్టణ యువమోర్చా నాయకులు తప్పేట్ల సతీష్, ఊరటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారుద

# బీహార్ ఓటర్ల ది చారిత్రక తీర్పు...

**- రాహుల్ గాంధీకి చెంపపెట్టు లాంటి తీర్పునిచ్చారు...**

**- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి....**







**హుజురాబాద్,నవంబర్14(పీసీడబ్ల్యూ న్యూస్):** బీహార్ ఎన్నికలలో ఎన్డీఏ కూటమి ఘనవిజయం సాధించిన సందర్భంగా హుజురాబాద్ బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో సంబరాలు చేపట్టారు. ఈ సందర్భంగా స్వీట్స్ పంపిణీ చేసి బాణసంచా కాల్చి ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూబీహార్ ఎన్నికలలో ప్రజలు ప్రధాని నరేంద్ర మోదీ అభివృద్ధి పథకాలకు, మంచి పాలనకు, ప్రజాప్రయోజన కార్యక్రమాలకు ఆకర్షితులై స్పష్టమైన మద్దతు ఇచ్చారని , ఆ మద్దతు బీహార్ ఎన్నికల్లో స్పష్టంగా కనబడిందన్నారు. బీహార్ ఓటర్లది చారిత్రక తీర్పు ఇచ్చిన ఓటర్లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా కాంగ్రెస్ అధినేత బీహార్ ఎన్నికల్లో లబ్ధి పొందడానికి విష ప్రచారం చేసిన ప్రజలు తిరస్కరించారన్నారు. ముఖ్యంగా ఓట్ చోరీ అంశంతో అలజడి సృష్టించడానికి విశ్వ ప్రయత్నం చేశారని విమర్శించారు. ముఖ్యంగా బిజెపిని టార్గెట్ చేస్తూ రాహుల్ గాంధీ చేపట్టిన అనేక పనికిమాలిన కార్యక్రమాలకు ప్రజలు చెంపపెట్టు లాంటి తీర్పునిచ్చారన్నారు. మోదీ 'సబ్కా సాథ్ %-% సబ్కా వికాస్' సిద్ధాంతం దేశ ప్రజల హృదయాలను గెలుచుకుందన్నారు. "దేశాన్ని శక్తివంతమైన, అభివృద్ధి చెందిన భారత దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రధాని మోదీ చేస్తున్న కృషికి బ్రహ్మరథం పట్టారన్నారు. ఈ ఫలితం దేశ వ్యాప్తంగా మరోసారి ఎన్డీఏ పట్ల నమ్మకాన్ని బలపరుస్తోంది." అని తెలియజేసిందన్నారు... ఈ చారిత్రక విజయం ఎన్డీఏ ప్రభుత్వ అభివృద్ధి కి మరింత బలాన్ని ఇచ్చిందని, భవిష్యత్తులో జరిగే ఎన్నికలైనా ఎన్డీఏ కీలక ప్రభావాన్ని చూపుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ మండల అధ్యక్షులు తూర్పాటి రాజు రాముల కుమార్ జిల్లా కౌన్సిల్ మెంబర్ రావుల వేణు జిల్లా కార్యవర్గ సభ్యులు గంగిశెట్టి ప్రభాకర్ తుముల శ్రీనివాస్ బిజెపి సీనియర్ నాయకులు నల్ల సుమన్ యాంసాని శశిధర్ శశిధర్ తిప్పపతిని రాజు అంకతి వాసు సబ్బని రమేష్ గంట సంపత్ మోతే తిరుపతి కొడిమ్యాల పవన్ భాస్కర్ యాదవ్ మధిర రమేష్ క్యాస వెంకటేష్ దేవేంద్ర ఆవుల సదయ్య గుల్ల అనిల్ మునిగంటి నాగరాజ్ గుడిపాటి కొండల్ రెడ్డి పారుపల్లి కొండల్ రెడ్డి మోడెపు వినయ్ ముప్పు మహేష్ చైతన్య రెడ్డి ప్రవీణ్ రెడ్డి దేవగౌడ కాశిట్టి కుమార్ కొన్ని ప్రవీణ్ ముసం వెంకటేశ్వర్లు తాళ్లపల్లి హరీష్ విక్రమ్ పూర్ణం చందర్ బోరగాల అజయ్ గుడిపాటి కొండాల్ రెడ్డి తూర్పాటి రాజశేఖర్ భూతం సాయిరాం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భేటీ బచావో. భేటీ పాడావో

**- ఐ. సి. డి.ఏస్ షాద్ నగర్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో**

**షాద్ నగర్,నవంబర్14(పీసీడబ్ల్యూ న్యూస్):** రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ లోని గర్ల్స్ హై స్కూల్ లో భేటీ బచావో. భేటీపాడవో అవగాహనా సదస్సు నిర్వహించడం జరిగింది. ఫరూక్ నగర్ ఎం. ఈ. ఓ. టీ. మనోహర్. సి.డి పి ఓ ఉదయ స్కూల్ హెడ్ మాస్టర్ పద్మ నాలిని పాల్గొన్నారు.

## తుంబూరు కుటుంబాన్ని పరామర్శించిన దయానంద్



**సత్తుపల్లి, నవంబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీప బంధువు, నారాయణపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు తుంబూరు ఉమామహేశ్వర్ రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ శుక్రవారం నారాయణ పురం గ్రామంలోనీ మృతిని నివాసానికి చేరుకొని చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, సత్తుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివా వేణు, సత్తుపల్లి మండలం కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్యుఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరామర్శ



**రామడుగు నవంబర్ 14 (పీసీడబ్ల్యూ న్యూస్):** చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండలం గుండి గ్రామానికి చెందిన చిలువేరి రాములు గౌడ్(గీతా కార్మికుడు) ప్రమాదావశత్తు తాటిచేట్టు పై నుంచి పడి మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరామర్శించి, భవిష్యత్తులో కుటుంబాన్ని ప్రభుత్వం తరుపున అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చిన చొప్పదండి శాసనసభ్యులు డా. మేడిపల్లి సత్యం ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జవాజి హరీష్ కో ల రమేష్ బొమ్మెర వేణి తిరుపతి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పిండి సత్యం మడ్డి శ్యామ్ సీనియర్ నాయకులు మడ్డి ఆంజనేయులు బాపు రాజు సిరాజ్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పోలీస్ కళాబృందంతో మాదకద్రవ్యాలపై ప్రజలకు అవగాహన ఏర్పాటు చేసిన పోలీసులు







**తొర్రూర్ ప్రతినిధి, నవంబర్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు మండలం చీకటయపాలెం గ్రామంలో శుక్రవారం రాత్రి తొర్రూరు పోలీసుల ఆధ్వర్యంలో పోలీస్ కళాబృందం ద్వారా ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్థులకు సైబర్ క్రైమ్, గంజాయి నిర్మూలన , డయల్ 100 వినియోగం, దొంగతనాల నివారణ చర్యలు, షీ టీం సేవలు , మద్యం సేవించి వాహనాలు నడిపినట్లయితే జరిగే ప్రమాదాలగురించి వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. గ్రామాల్లో నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం తగ్గించేందుకు పోలీసులు తీసుకుంటున్న చర్యలను పోలీస్ కళాబృందం వివరించారు. అలాగే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ ఎస్సై గొల్లమూడి ఉపేందర్, అదనపు ఎస్సై అంజమ్మ, హెడ్ కానిస్టేబుల్ సారయ్య, కానిస్టేబుల్ మధు, రాజు, శరత్, పోలీస్ కళాబృందం సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# 18న నాయి బ్రాహ్మణుల వనమహోత్సవం

**నాయి బ్రాహ్మణ కుల బంధువులారా.. వేలాదిగా తరలిరండి**

**నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక ఖమ్మం నగర అధ్యక్షులు యలమందల జగదీష్ నాయి**

**ఆత్మీయత, అనురాగాలకు వేదికగా నాయి బ్రాహ్మణల కార్తీకమాస వనసమారాధన**

**ఆధ్యాత్మిక, ఆహ్లాదం, ఐక్యమత్యమే లక్ష్యంగా కుటుంబ సమేతంగా తరలిరావాలి**

**ఉద్యోగ సంఘ నాయకులు దేవరకొండ సైదులు**





**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆత్మీయత, అనురాగాలకు వేదికగా ఈనెల 18న మంగళవారం ఖమ్మం నగరం గొల్లగూడెం రోడ్డులో గల చెరుకూరి వారి మామిడితోటలో నాయి బ్రాహ్మణుల కార్తీకమాస వనసమారాధన కార్యక్రమాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయి బ్రాహ్మణులు కుటుంబ సమేతంగా తరలివచ్చి విజయవంతం చేయాలని నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక ఖమ్మం నగర అధ్యక్షులు యలమందల జగదీష్ నాయి, ఉద్యోగ సంఘ నాయకులు దేవరకొండ సైదులు, మాజి మార్కెట్ వైస్ చైర్మన్ కొలిపాక బాబురావు పిలుపునిచ్చారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... ఆధ్యాత్మికత, ఆహ్లాదం, ఐక్యమత్యమే లక్ష్యంగా నవంబర్ 18న మంగళవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నాయి బ్రాహ్మణులందరూ ఒక కుటుంబంగా ఒక దగ్గరకు రావడం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ దుగ్యాల ఆశోక్ హాజరవుతున్నారన్నారు. ఈ వనబోజనాల కార్యక్రమంలో దుగ్యాల ఆశోక్ వారి అనుభవం భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ సంవత్సరం మొదలుకొని ప్రతి సంవత్సరం జరిగే వనమహోత్సవాలు నాయి బ్రాహ్మణుల ఐక్యత, అభివృద్ధికి వేదిక అవ్వాలని పిలుపునిచ్చారు. ఈ వనమహోత్సవంలో పిల్లలు, మహిళలు, యువత పాటలు, ఆటలు, కేరింతలతో 'మంగళవారం సరదాగా' గడిచిపోయి వచ్చే 5 వేల మంది నాయి బ్రాహ్మణులకు శాశ్వతంగా గుర్తుండాలన్నారు. నాయి బ్రాహ్మణులు ప్రతి ఒక్కరూ ఇది నా కుటుంబ వనమహోత్సవం అనుకొని ప్రతి ఒక్కరిని తరలించేందుకు, మన బలం, మన ఐక్యతను చాటి చెప్పాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఉద్యోగ సంఘ నాయకులు జిడుగు వెంకటరామకృష్ణ, జిల్లా నాయకులు నంద్యాల నరసింహారావు, రావులపాటి శ్రీనివాస్, సంఘం గౌరవ సలహాదారులు సూత్రాల శ్రీనివాసరావు నాయి, దోమకొండ నాగేశ్వరరావు నాయి, వర్కింగ్ ప్రెసిడెంట్ లు తుపాకుల కృష్ణ నాయి, శ్రీరాముల సైదులు నాయి, శ్రీపతి రామనాథం నాయి, కొలిపాక రాఘవేంద్రరావు నాయి, సహాయ కార్యదర్శి సురభి సందీప్ నాయి, కోశాధికారి అద్దంకి పాపారావు నాయి, ప్రచార కార్యదర్శి చిట్యాల సైదాబాబు నాయి, స్టీరింగ్ కమిటీ సభ్యులు గరిడేపల్లి నవీన్ నాయి, సభ్యులు మాదారపు భిక్షం నాయి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ సంస్కారం కలిగి ఉండాలి





**● పర్యావరణ పరిరక్షణకు కృషి చేసే విధంగా జీవన నైపుణ్యాలు పెంచుకోవాలి**

**హన్మకొండ, సెప్టెంబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** 66 వ డివిజన్ కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ ఉన్నత పాఠశాల హసన్ పర్తి యందు నవ భారత నిర్మాత దేశ మొదటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ జన్మదిన సందర్భంగా బాలల దినోత్సవం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆకుతోట శాంతారాం కర్ణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 66వ డివిజన్ కార్పొరేటర్ గురు మూర్తి శివకుమార్ గౌరవ అతిథులుగా నేతాజీ శిశు మందిర్ కరస్పాండెంట్ వలస జ్ఞానేశ్వర్ మరియు ఆలేటి సత్య ప్రకాష్ ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ అధ్యక్షులు నాగేశ్వరరావు కార్యదర్శి శ్యాంసుందర్ మరియు సభ్యులు రవిబాబు హాజరైనారు ఈ సందర్భంగా కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు కాబట్టి విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత విద్యావంతులై దేశానికి సేవ చేయాలని దేశ అభివృద్ధిలో భాగ స్వాములు కావాలని తెలిపిన గౌరవాధ్యక్షులు వలస జ్ఞానేశ్వర్ రావు మాట్లాడుతూ బాల్యం అపురూపమైనదని బాల్యాన్ని చాలా సంతోషంగా గడపాలని క్రమ శిక్షణతో ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలు శ్రద్ధగా నేర్చుకుని ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో స్థిరపడాలని 43 సంవత్సరాల క్రితం మేడం ఆకుతోట ఊర్మిల పాఠశాలను స్థాపించి విద్యాభివృద్ధికి కృషి చేసినారని ఆమె నాటిన మొక్క దిన దిన అభివృద్ధి చెందుతూ వటవృక్షమై అనేకమంది చదువు కోవడానికి అవకాశం కల్పించినదని ఇందుకు వారు సదా స్మరణీయులని తెలిపినారు ఆలేటి సత్య ప్రకాష్ మాట్లాడుతూ ఈ పాఠశాల క్రమశిక్షణ సంస్కార వంతమైన విద్యను అందిస్తుందని నా కుమారులు కూడా ఈ పాఠశాల విద్యార్థులు కావడం గర్వంగా ఉందని తెలిపినారు అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ ఆకుతోట శాంతారావు కర్ణ మాట్లాడుతూ మా తల్లి ఆకుతోట ఊర్మిళ హసన్ పర్తి లో ఒక ఇంగ్లీష్ మీడియం పాఠశాలను స్థాపించి విద్యార్థులకు ఆంగ్ల విద్యను అందు బాటులోకి తీసుకు రావాలని ముందు చూపుతో పాఠశాలను స్థాపించి వేల మంది విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ సంస్కారము ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణకు కృషి చేసే విధంగా జీవన నైపుణ్యాలు పెంచుకునేలా తీర్చిదిద్దినారని ఆమె స్థాపించిన ఈ సుజాత విద్యానికేతన్ పాఠశాలను ఆమె ఆశయాలకు ఆదర్శాలకు అనుగుణంగా నేను నడిపిస్తున్నానని ఆమె స్మృతి అర్థం ఈ బాలల దినోత్సవం సందర్భంగా మన పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ సుమారు 40000 విలువచేసే 500 పరీక్ష ప్యాడులను ఉచితంగా ఈ బాలల దినోత్సవ కానుకగా అందిస్తున్నామని తెలిపినారు ఈ కార్యక్రమంలో ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ అధ్యక్షులు నాగేశ్వరరావు కార్యదర్శి శ్యాంసుందర్ సభ్యులు రవి బాబు పాల్గొని పాఠశాల ప్రిన్సిపాల్ ఆకుతోట శాంతారావు కర్ణ చేస్తున్న పర్యావరణ పరిరక్షణ కృషిని గుర్తించి జాతీయ రాష్ట్ర జిల్లా స్థాయిలో అనేక అవార్డులు పొందినందున సత్కరించడం జరిగినది తెలంగాణ పక్షులు బర్డ్స్ ఆఫ్ తెలంగాణ పాకెట్ బుక్కును ఆవిష్కరించి విద్యార్థులకు పంపిణీ చేసినారు అనంతరము విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ గూడూరు లక్ష్మీనారాయణ ఉపాధ్యాయులు జూపాక నాగరాజు ఏ వెంకట్ పి వెంకటేశ్వర్లు ఈ ప్రవీణ్ రాధా కుమారి సబిహా బేగం అరుణ సిహెచ్ సుచిత్ర సిహెచ్ సంధ్య జి సంధ్య సరిత లావణ్య మౌనిక ప్రవళిక గీత సుధారాణి దేవిక దివ్య పాల్గొన్నారు.



# జూబ్లీహిల్స్ గెలుపు స్థానిక ఎన్నికల్లో ఎంఐఎం-కాంగ్రెస్ స్నేహపూర్వక పోటీకి బీజం కావాలి





**ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్**

**బిహార్‌లో ఎంఐఎం ఎమ్మెల్యేలు.. జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుపై ఎంఐఎం సంబరాలు**



**కరీంనగర్ టౌన్ నవంబర్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** బిహార్ రాష్ట్రంలోని సీమాంచల్ ప్రాంతంలో ఎంఐఎం పార్టీకి సంబంధించిన 6గురు ఎమ్మెల్యేల విజయం సాధించడం పట్ల, హైదరాబాద్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ మద్దతుతో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించడం పట్ల ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ పట్టణంలో ఎంఐఎం జిల్లా కార్యాలయం దారుస్సలాం ఎదుట ఎంఐఎం మాజీ కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు స్వీట్లు పంచి, బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఐఎం నేత గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ తెలంగాణ వలే, హైదరాబాద్ మాదిరిగా సీమాంచల్ ప్రాంతం బారిష్ఠర్ అసదుద్దీన్ ఓవైసీ సూచనలతో వేగంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. గతంలో సినిమాలు ప్రాంతంలో ఐదుగురు ఎమ్మెల్యేలు గెలిస్తే అందులో నలుగురు ఎమ్మెల్యేలు పార్టీని వదిలి ఆర్జేడీలోకి వెళ్లారని వారికి పార్టీ అధిష్టానం టికెట్లు ఇవ్వలేదని, ఈరోజు వాళ్లు అడ్రస్ లేకుండా పోయారని పేర్కొన్నారు. అల్లాహ్ దయవల్ల ఎంఐఎంకు సీమాంచల్ ప్రజలు వెన్నుదన్నుగా నిలిచారని, ఆరుగురు ఎమ్మెల్యేలను గెలిపించి ఎంఐఎంను మరింత బలోపేతం చేశారని చెప్పారు. బీహార్ లో గెలిచిన నూతన ఎంఐఎం ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు తెలిపారు. ఇటు తెలంగాణలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో ఎంఐఎం పార్టీ మద్దతుతో అధికార పార్టీకి చెందిన నవీన్ యాదవ్ గెలుపు పై హర్షం వ్యక్తం చేశారు. బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీకి, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఇదే ఊపును కొనసాగించడానికి ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ సూచనలతో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాలోచనలు చేసి, కాంగ్రెస్ అధిష్టానం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక మంచి ఆలోచనతో ఎంఐఎం పార్టీతో స్నేహపూర్వక పోటీ చేస్తే, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి లాభం జరుగుతుందన్నారు. బీహార్ రాష్ట్రంలో ఆర్జెడి కాంగ్రెస్ కూటమి ఎంఐఎం పార్టీ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ అడిగినన్ని సీట్లు ఇస్తే ఈరోజు అధికారం వారికి దక్కేదని, మహా ఘట్ బంధన్, ఎంఐఎం పార్టీని చేర్చుకోకపోవడం వల్లనే ఆర్జెడి కాంగ్రెస్ కూటమి తీవ్రంగా నష్టపోయిందని, బిజెపి లాభపడిందని గుర్తు చేశారు. ఎంఐఎం పార్టీని ఓట్లు చీల్చే పార్టీగా ముద్ర వేసి, మహా ఘట్ బంధన్ నాయకులు విమర్శించారని, కానీ మహా ఘట్ బంధన్ కూటమి బిజెపి కి పోటీ ఇవ్వకపోగా, కేవలం ఎంఐఎం పార్టీ పాలిట శాపంగా మారిందిన్నారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, సహాయ కార్యదర్శి ఆతిన, ఇబ్రహీం, మాజీ కార్పొరేటర్లు షర్ఫుద్దీన్, ఆరిఫ్ అహ్మద్, మాజీద్ హుస్సేన్, నాయకులు అలిబాబా, అజర్ దబీర్, మొహసీన్ మొహియుద్దీన్, సాజిద్, అంజద్ ఖాన్, తాజుద్దీన్, అసదుల్లా బేగ్, అబ్దుల్లా అసిమ్, ఇస్మాయిల్, ఖాజా మజారొద్దీన్, సుల్తాన్ మీర్జా, అల్మాస్, యునూస్, అన్నేమల్ల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ నిర్లక్ష్యం...

**● ఆరు నెలలుగా పక్కనపెట్టిన జేసీబీ తుప్పు పట్టి నాశనం ● ప్రజా ధనంపై నిర్లక్ష్యం..**

**● పనులు ఆగిపోవడంతో గ్రామస్తుల ఆగ్రహం**





**ములుగు జిల్లా, 14(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎటూరునగారం మండలం, నవంబర్ ఎటూరునగారం మండల పరిధిలో గ్రామాభివృద్ధి కోసం తెచ్చిన జేసీబీ కప్ సుమారు ఆరు నెలలుగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వాడకుండా నిర్లక్ష్యంగా పడి ఉంది. వర్షాలు, ఎండల ధాటికి పరికరం పూర్తిగా తుప్పు పట్టి వాడుకోలేని స్థితికి చేరింది. పంచాయతీ ఆస్తులను ఇలా పక్కనపెట్టడం వల్ల ప్రభుత్వ నిధులకు నష్టం జరుగుతోందని గ్రామస్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల వివరాల ప్రకారం, గ్రామాభివృద్ధి పనులురహదారి లెవెలింగ్, కాలువలు, బోర్లెవెలింగ్, చెరువుల పరిరక్షణ, సైటు క్లీనింగ్ వంటి కార్యక్రమాల కోసం ఈ జేసీబీ కప్‌ను మండలానికి కేటాయించారు. అయితే, పంచాయతీ కార్యాల ?యాధికారుల బద్ధకంతో పరికరాన్ని నిర్ణీత సమయంలో ఉపయోగించకపోవడంతో అది నాశనమవుతోంది. దీంతో గ్రామంలో చేపట్టాల్సిన అనేక ప్రజాపనులు నెలలుగా నిలిచిపోయాయి. **"ఎన్నిసార్లు చెప్పినా స్పందన లేదు" ప్రజల వాపో** గ్రామ సర్పంచ్, స్థానిక వేడుకుల కమిటీ సభ్యులు, అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పలుమార్లు పంచాయతీ కార్యదర్శికి తెలియజేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని గ్రామ పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక స్థానికుడు మాట్లాడుతూ "పరిసరాల అభివృద్ధి కోసం తెచ్చిన పరికరాన్ని ఇలా వృథా చేయడం బాధాకరం. ప్రభుత్వ డబ్బు పెట్టి కొనిపెట్టిన వస్తువు పనికొచ్చేలా ఉంచాలి. కానీ ఇక్కడ అధికారులు పరిచయం చూపడంలేదు" అన్నారు. పనులు ఆగిపోవడంతో గ్రామ అభివృద్ధి నిలిచింది గ్రామంలో ప్రస్తుతం నిలిచిపోయిన పనుల జాబితా కూడా పెద్దగానే కనిపిస్తోంది. ముఖ్యంగా కొత్త లేఅవుట్లలో రోడ్‌లు చేయాల్సిన పని శ్మశానవాటికలో లెవెలింగ్ పాఠశాల ప్రాంగణం శుభ్రపరిచే పని కాలువల తవ్వకంగ్రామ చెరువుకు సంబంధించిన పూడికతీత కార్యక్రమంఈ పనులన్నీ జేసీబీ లేక నిలిచిపోయాయని గ్రామ పెద్దలు వివరించారు. పంచాయతీ అభివృద్ధి నిధులు అందుబాటులో ఉన్నా, పరికరం వృథా కావడం వల్ల పనులు ప్రారంభం కావడం లేదని వారు తెలిపారు. **"సంక్షేమ పథకాలు ఇచ్చి%ొా% వాటి అమలు మాత్రం లేవు" .. యువత అభిప్రాయం** గ్రామ యువత నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి కోసం నిధులు, పరికరాలు పంపిస్తే%ొా% వాటిని వినియోగించడంలో స్థానిక అధికారుల నిర్లక్ష్యం పెద్ద అడ్డంకిగా మారుతోందని అన్నారు. "జేసీబీ కప్‌ను కాపాడటానికి ఏ చర్యలు తీసుకోలేదు. పైగా దానిని బయట ఉంచి వర్షంలో తడిపారు. పరికరం కుళ్లిపోవడానికి ఇదే కారణం" అని మరో యువకుడు పేర్కొన్నాడు. **పట్టింపు లేని పంచాయతీ సిబ్బందిపై ప్రజా విమర్శలు** పంచాయతీలో రోజువారీ కార్యకలాపాలు కూడా తరచూ ఆలస్యమవుతున్నాయని, ప్రజలకు ఎదురుచూపులు తప్పడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వీటన్నిటిపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని వారు కోరుతున్నారు. **గ్రామ పెద్దల డిమాండ్** తుప్పు పట్టిన జేసీబీని వెంటనే రిపేర్ చేయాలిదాని సంరక్షణ బాధ్యతను పంచాయతీకి అధికారికంగా అప్పగించాలినిర్లక్ష్యానికి కారణమైన అధికారులపై విచారణ జరపాలినిలిచిపోయిన ప్రజాపనులు వెంటనే ప్రారంభించాలి **జేసీబీ నష్టంపై అంచనా** యాంత్రిక నిపుణుల అంచనా ప్రకారం, ఆరు నెలలుగా సూర్యపు ఎండ, భారీ వర్షాల ధాటికి తుప్పు పట్టిన ఈ కప్‌ను మళ్లీ వాడే స్థితికి తెచ్చేందుకు అధిక ఖర్చు అవుతుందని చెబుతున్నారు. కొత్తది కొనుగోలు చేయాలంటే సుమారు 2 నుండి 2.5 లక్షల వరకు అవుతుందని అంచనా. **అధికారులు స్పందించాలి: స్థానికులు** "గ్రామ ప్రజల నిధులతో, ప్రభుత్వ అభివృద్ధి నిధులతో తెచ్చిన పరికరాలను ఇలా నిర్లక్ష్యం చేయడం అనేది బాధ్యతారాహిత్యం. వెంటనే ఉన్నతాధికారులు గ్రామాన్ని సందర్శించి చర్యలు తీసుకోవాలి" అని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. సమస్య పై స్థాయి అధికారులకు చేరింది ఈ నిర్లక్ష్యం జిల్లా అధికారుల దృష్టికి త్వరలో తీసుకెళ్లనున్నట్లు గ్రామ సర్పంచ్ తెలిపారు. "వెనువెంటనే చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున నివాసితులు దీక్షకు దిగతాం" అని హెచ్చరించారు.

---

# ఆషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలకు ఎల్‌ఈడి టీవీలు వితరణ

**● మా సహకారం ఎప్పుడూ ఉంటుంది**

**● కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్**







**సత్తుపల్లి, నవంబర్ 14 (పిసీడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం జిల్లా, సత్తుపల్లి మండలంలో చిల్డ్రన్స్ డే సందర్భంగా పలు పాఠశాలలో ఎల్‌ఈడి టీవీలు, పిల్లలకు అవసరం ఉన్న సామాగ్రిని ఆషా ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ అందజేశారు. బాలలదినోత్సవాన్ని పురస్కరించుకొని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన రుద్రాక్షపల్లి, తోగ్గూడెం, బాసారం, కొమ్ముగూడెం గ్రామాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్వాడీ సెంటర్స్ లో గిరిజన విద్యార్థిని, విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనంచేసి అందరికి బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసినారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు తోగ్గూడెం, కొమ్ముగూడెం అంగన్వాడీ సెంటర్ కు కలిపి 2 ఎల్‌ఈడి టివి లు అందజేశారు. తోగ్గూడెం, కొమ్ముగూడెం స్కూల్ కు అంగన్వాడీ సెంటర్ కు స్టాఫ్ కుర్చీలు, అంగన్వాడీ సెంటర్ చిన్నారులకు కిడ్స్ కుర్చీలు, చాపలు, బాసారం అంగన్వాడీ సెంటర్ కు కిడ్స్ కుర్చీలు, చాపలు ఆషా ఫౌండేషన్ ద్వారా డాక్టర్ మట్టా దయానంద్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అభివృద్ధిలో వెనకబడిన గ్రామాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అందుతున్న అభివృద్ధి కాకుండా మా వంతుగా ఆషా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు మా సహకారం ఎల్లప్పుడు అందిస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎంఈఓ రాజేశ్వర్ రావు, సత్తుపల్లి ఏఎంసి చైర్మన్ దోమ ఆనంద్, సీనియర్ నాయకులు దొడ్డా శ్రీను, కమల్ పాషా, రుద్రాక్షపల్లి పంచాయతీ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, చిన్నారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో ప్రజలు ప్రజా ప్రభుత్వం వైపే వున్నారని మరోసారి నిరూపించారు: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం





**రామడుగు నవంబర్ 14 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఎన్నిక ఏదైనా గెలుపు మాత్రం కాంగ్రెస్ దే అన్నట్టు ప్రతిపక్షాలకు దీటుగా రేవంత్ రెడ్డి నాయకత్వం బలమైన నాయకత్వం గా మరోసారి రుజువు చేస్తూ నేడు జూబ్లీహిల్స్ నియోజక వర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత పై 24,658 ఓట్ల మెజారిటీ తో ఘన విజయం సాధించి విజయ ఢంకా మోగించిన సందర్భంగా రామడుగు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాజీ ఎంపీపీ జవ్వాజి హరీష్ ఆధ్వర్యం లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించి స్థానిక బస్టాండ్ వద్ద బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేసిన చొప్పదండి శాసన సభ్యులు డా మేడిపల్లి సత్యం ఇట్టి కార్యక్రమం లో పాల్గొన్నవారుమార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పిండి సత్యం, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మరవెని తిరుపతి , మాజీ ఎంపీపీ వీర్ల నర్సింగరావు, మాజీ సర్పంచులు కోల రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శిపంజాల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు అనుపురం పరశురాం తడగొండ హనుమంతు , గ్రామ శాఖ అధ్యక్షుడు కర్ణ శ్రీను మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు అసిఫ్ తడగొండ నర్సింగ్ బాబు,శీను , లక్ష్మణ్ ,అజయ్ ,మధు, స్వామి ,వేణు ,మండలం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జవ్వాజి అజయ్, జిల్లా నాయకులు ,మండల నాయకులు ,వివిధ గ్రామ శాఖ అధ్యక్షులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు , యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ ఎస్ యు ఐ ,కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

---

# కల్లు గీత కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

**ఈనెల 28న చలో సూర్యాపేట**

**ఇంటికో గౌడు ఊరుకో వాహనంతో తరలిరావాలి**

**కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గుండెబోయిన రవి గౌడ్**





**ములుగు జిల్లా, నవంబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తవుతున్న కల్లుగీత కార్మిక సమస్యలపై ఏమాత్రం స్పందించకపోవడం దుర్మార్గమైన చర్య అని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గుండెబోయిన రవి గౌడ్ జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ అన్నారు శుక్రవారం రోజున జిల్లా కమిటీ ముఖ్యుల సమావేశం జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఉయ్యాల మధుకర్ గౌడ్ అధ్యక్షతన జిల్లా కేంద్రం లోని సీఐటీయూ కార్యాలయం లో జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి హాజరైన రవి గౌడ్ శ్రీనివాస్ గౌడ్ లు మాట్లాడుతూ తాటి చెట్ల పైనుండి పడిన బాధితులపెండింగ్ లో ఉన్నా ఎక్స్ గ్రేషియాలు 12 కోట్ల రూపాయలు తక్షణమే విడుదల చేయాలని అలాగే తాడి కార్పొరేషన్ సంబందించిన పెండింగ్ చెక్కులు విడుదల చేయాలని ప్రతి కల్లుగీత కార్మికునికి సేఫ్టీమోకులు తక్షణమే అందజేయాలని 50 సంవత్సరాలు నిండిన ప్రతి గీత కార్మిక ఎటువంటి శరతులు లేకుండా వృత్తి పింఛన్ సాంక్షన్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం లో అప్పుడు ఎమ్మెల్యే గా ఉన్నా ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఏజెన్సీ లో అనాదిగా కల్లు గీత వృత్తి చేస్తున్నా గీత కార్మికుల కు సొసైటీ లు పునరుద్దరణ చేయాలనీ అసెంబ్లీ లో మాట్లాడటం జరిగిందని ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు దాటిన కూడాఇప్పటిదాకా ఏజెన్సీ గీత కార్మికుల విషయం లో స్పందించక పోవడం సరికాదని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీలు అమలు చేయక పోవడం చాలా బాధాకరమని అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న సూర్యాపేట జిల్లా కేంద్రం లో భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని ఈ బహిరంగ సభకు జిల్లా లోని ప్రతి సొసైటీ నుండి ఇంటికో మనిషి ఊరుకో వాహనంతో పెద్ద ఎత్తున తరలి రావాలని గీతకార్మికులకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో కల్లుగీత సోషల్ మీడియా కన్వీనర్ ఉ య్యాల మధుకర్ గౌడ్ జిల్లా ఉపాధ్యక్షులు రుద్రబోయిన మల్లేష్ గౌడ్ పులి రమేష్ గౌడ్ జిల్లా సహాయ కార్యదర్శి మామిండ్ల సంపత్ గౌడ్ జిల్లా కమిటీ సభ్యులు మునిగాల సుధాకర్ గౌడ్ నక్క యాకయ్య గౌడ్ వత్సవాయి సారయ్య గౌడ్ గట్టు శంకర్ గౌడ్ తో పాటు పాల్గొన్నారు

---

# నేటి బాలలే రేపటి పౌరులు

**● ఘనంగా బాలల దినోత్సవం జరుపుకున్న దాట్ల ప్రాథమిక పాఠశాల**



**తొర్రూర్ ప్రతినిధి,నవంబర్ 14(పీసిడబ్ల్యూ న్యూస్):** చాచా నెహ్రూ పుట్టినరోజు, బాలల అందరికీ పండుగ రోజు. పాఠశాలలో చదివే విద్యార్థిని, విద్యార్థులకు 14 నవంబర్ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తూ ఉంటారు. ఆ తేదీ రాగానే వారి ఆనందాలకు అవధులే ఉండవు. తన పిల్లలను ఎంతో చక్కగా అలంకరించి పాఠశాలకు పంపించాలని కు తూహలంగా కూడా చిన్నారుల తల్లిదండ్రులకు ఎంతో ముచ్చటగా ఉంటుంది. పాఠశాలకు వస్తున్న విద్యార్థినీ విద్యార్థులను చూసి ఉపాధ్యాయులే మన పాఠశాల విద్యార్థులేనా వీరు అనుకునే విధంగా ఇంట్లో రెడీ అయి వస్తుంటే వారిలో కూడా ఆనందం కొట్టొచ్చినట్లుగా కనబడుతుంది. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలోని దాట్ల ప్రాథమిక పాఠశాలలో జవహర్ లాల్ నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.కె పాషా ప్రసంగిస్తూ విద్యార్థులకు నెహ్రూ జీవిత చరిత్ర వివరించడం జరిగింది, నెహ్రూ కు పిల్లలు అంటే ఎంతో ప్రేమ అనిఅందుకే చాచా నెహ్రూ అనే పిలుస్తారని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా సీనియర్ ఉపాధ్యాయులు చింతల సురేష్ మాట్లాడుతూ విద్యార్థులు నెహ్రూ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని మంచి అలవాట్లు పెంపొందించుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. బాలల దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు నృత్య ప్రదర్శన పోటీలు, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు , పాటల పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొని బాలల దినోత్సవ వేడుకలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్ అనిత, కవిత ,అపర్ణ రామచందర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



---

# కాంగ్రెస్ సంక్షేమ పథకాలే జూబ్లీహిల్స్ గెలుపు

**కాంగ్రెస్ కార్యకర్తల కష్టం వృథా కాలేదు**

**మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాపా సుధాకర్**

**జూబ్లీహిల్స్ గెలుపుపై కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు**



**తల్లాడ, నవంబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే జూబ్లీహిల్స్ గెలుపని, కాంగ్రెస్ కార్యకర్తల కష్టం వృథా కాలేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాపా సుధాకర్ అన్నారు. శుక్రవారం తల్లాడ ప్రధాన సెంటర్లో కాంగ్రెస్ పార్టీ మండల నాయకుల ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన సందర్భంగా నవీన్ యాదవ్ కు హార్దిక శుభాకాంక్షలు తెలియజేసారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కాపా సుధాకర్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించడమంటే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలే కారణమన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ప్రజల ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తల యొక్క కష్టం వృథా కాలేదని ఇలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను కూడా భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు దిరిశాల నాగేశ్వరరావు, జక్కంపూడి కిషోర్, దీవెలా కృష్ణయ్య, యుత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ కటికి కిరణ్, మాజీ సర్పంచ్ దిరిశాల సత్యనారాయణ, సామినేని రామప్పరావు, గోవింద శ్రీనివాసరావు, తుమ్మలపల్లి రమేష్, రాయల రాము, జెడ్పిటిసి ప్రసాద్, తాళ్ల వెంకటేశ్వర్లు, భూక్య అంజి, గుజ్జర్లపూడి చింటు, దీవెల వెంకటేశ్వరావు, కాపా మహేష్, అమర్లపూడి కిషోర్, ఎస్కే నాగులమీరా తదితరులు పాల్గొన్నారు.



# దేవన్నపేట ప్రాథమిక పాఠశాలలో ఘనంగా స్వయం పాలన దినోత్సవ వేడుకలు



**హన్మకొండ,నవంబర్ 14 (పీసీడబ్ల్యూ న్యూస్):** హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం దేవన్న పేట ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవం, స్వయం పాలన ఘనంగా జరిగింది. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి అభ్యసన సామర్థ్యాలకు అనుగుణంగా పాఠ్య బోధన చేయడం ఎంతగా నో ఆకట్టుకున్నది ఈ కార్య క్రమంలో ఐదవ తరగతి విద్యార్థులు జి. యశ్వంత్ డీఈవో గా జి. రుత్విక్ ఎంఈఓ గా టీ. మనోజ్ఞ ప్రధానోపాధ్యాయురాలుగా ఎ. చైతన్య రామ్ పీఈటి గా బి. సాన్వి, వై. సాత్విక ఎం. మీనాక్షి, సిహెచ్. సిరి చందన, ఎస్. అశ్విత్ రాజు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. తదనంతరం తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి పిల్లలకు అందమైన బాల్యాన్ని ఎలా అందించాలో వివరించారు. ఈ సమావేశంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఆర్. సురేఖ బాలికలకు తెలుపు, నలుపు రంగు రిబ్బన్లు అందజేసి పిల్లలకు స్వీట్లు పంచిపెట్టారు ఈ కార్యక్రమం విజయవంతం చేసిన విద్యార్థులను తల్లిదండ్రులను ఉపాధ్యాయులు ఆర్. సురేఖ గుండ ప్రభాకర్ అభినందించారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం

## కీలకపాత్ర పోషించిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

## ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రెడ్డి ప్రచార హోరును ప్రశంసించిన మంత్రులు..







**తొర్రూరు ప్రతినిధి, నవంబర్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయంతో రాష్ట్రం అంతటా సంబరాలు జోరందుకున్నాయి. జూబ్లీహిల్స్ గడ్డ సీఎం రేవంత్ రెడ్డి అడ్డ అని, జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం సాధించడంతో కార్యకర్తలు అంబరాన్నంటిన ఆనందోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోరబండ డివిజన్ ఇంచార్జ్, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, యూసఫ్‌గూడా డివిజన్ ఇంచార్జ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డిలను రాష్ట్ర మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, వాకాటి శ్రీహరి, అలాగే కార్పొరేషన్ చైర్మన్‌లు ప్రత్యేకంగా అభినందించారు. గత 25 రోజులపాటు అత్యవసర పరిస్థితులు తప్ప పాలకుర్తి నియోజకవర్గానికి రాకుండా, పార్టీ పిలుపు మేరకు ఇద్దరూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో పూర్తిస్థాయిలో పనిచేశారని పేర్కొన్నారు. ఒకరు బోరబండ డివిజన్, మరొకరు యూసఫ్‌గూడా డివిజన్లో ప్రజలను నేరుగా సంప్రదిస్తూ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం తమదైన శైలిలో ప్రచారాన్ని నిర్వహించారని వారు అన్నారు. ఎమ్మెల్యే దృఢసంకల్పం, కృషి, ప్రజలతో నేరుగా మమేకం కావడం నవీన్ యాదవ్ విజయంలో కీలకపాత్ర పోషించగలిగారని మంత్రులు అభినందించారు. ఈ విజయంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం మరింత బలపడిందని వారు పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం నేపథ్యంలో పాలకుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా కూడా పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంచుకుని, విజయోత్సవాలను ఘనంగా జరిపారు.

# డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ స్వర్గీయ ముహమ్మద్ ఫాయఖ్ అలీ సేవలకు యునైటెడ్ టీమ్ నివాళి



**కరీంనగర్ టౌన్ నవంబర్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే మరియు ల్యాండ్ రికార్డు స్వర్గీయ ముహమ్మద్ ఫాయఖ్ అలీ ఆకస్మిక మరణంపై యునైటెడ్ తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఫర్ మైనారిటీస్ (యునైటెడ్ టీమ్) తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసింది. ఒక సంతాప ప్రకటనలో యునైటెడ్ టీమ్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నిసార్ అహ్మద్ మాట్లాడుతూ, ముహమ్మద్ ఫాయఖ్ అలీ ప్రతిభావంతుడు, కృషిశీలుడు, సున్నిత స్వభావం గల విధేయ అధికారి అని అన్నారు. సేవా కాలమంతా ఆయన ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి మరియు కరీంనగర్ జిల్లాల్లో ప్రజల కోసం, ముఖ్యంగా మసీదులు మరియు వక్ఫ్ ఆస్తులతో సంబంధించిన విభాగాల్లో అమూల్యమైన సేవలు అందించారని పేర్కొన్నారు. ఈ జిల్లాల్లోని వక్ఫ్ ఆస్తులు, మసీదుల వివరాలపై ఫాయఖ్ అలీకి సంపూర్ణ అవగాహన ఉండేదని ఆయన గుర్తుచేశారు. వారి ఆకస్మిక మరణం ముస్లిం సమాజానికి మరియు మొత్తం మిల్లతుకు పెద్ద నష్టమని పేర్కొన్నారు. యునైటెడ్ తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఫర్ మైనారిటీస్ (యునైటెడ్ టీమ్) తరఫున స్వర్గీయ ముహమ్మద్ ఫాయఖ్ అలీ సేవలకు షేక్ నిసార్ అహ్మద్ హృదయపూర్వక నివాళులు అర్పించారు.

# 17, 18 తేదీల్లో కవిత పర్యటన

## జాగృతి జనంబాట పేరుతో ప్రజల వద్దకు

## తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి నవీన్

## జాగృతి జనంబాట పోస్టర్ ఆవిష్కరణ




**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఈ నెల 17, 18 తేదీల్లో ఖమ్మం జిల్లాలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పర్యటన ఉంటుందని ఆ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి పేర్కొన్నారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత పర్యటన వివరాలు వెల్లడించారు. ఈ నెల 16న రాత్రికి మధిరకు కవిత చేరుకుంటారని తెలిపారు. 17న మధిరలో జనంబాట ప్రారంభమై సత్తుపల్లి, వైరాలో ముగుస్తుందన్నారు. 18న ఖమ్మం, పాలేరులో ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారన్నారు. 18న ఖమ్మంలో మేధావులతో, తెలంగాణ ఉద్యమ కారులతో కవిత సమావేశమవుతారని తెలిపారు. అనంతరం కళాకారులతోనూ మమేకమవుతారన్నారు. అదే సందర్భగా తన దృష్టికి వచ్చిన పలు సమస్యలను ప్రెస్‌కాన్ఫరెన్స్‌లో వివరిస్తారన్నారు. కవిత పర్యటనను విజయవంతం చేయాలని జిల్లాలోని తెలంగాణ విద్యావంతులు, ఉద్యమకారులు, మహిళలను కోరుతున్నామన్నారు. అనంతరం జనంబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ మీడియా సమావేశంలో తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షురాలు గట్టు కరుణ, ఐటి విభాగం కార్యదర్శి శశిధర్ రాష్ట్ర కార్యదర్శి కిషన్ నాయక్, అనితా చౌదరి, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి మాధవి తదితరులు పాల్గొన్నారు.

# శివాలయాన్ని దర్శించుకున్న మంత్రి తుమ్మల



**సత్తుపల్లి, నవంబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సత్తుపల్లి పట్టణంలో గల గుడిపాడు దుర్గా పార్వతీ సహిత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు, దీపాలంకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ వారు మంత్రి తుమ్మలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మార్కెటింగ్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, కొల్లి నరసింహారావు, చల్లగుల్ల కృష్ణయ్య, నున్నా రత్నాకర్, గాదె చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలు జ్ఞానార్జనకు నిత్య వనరులు

## లైబ్రరీ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.విజయ్ కుమార్

## గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం





**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** గ్రంథాలయాలు జ్ఞానార్జనకు నిత్య వనరులని ఎస్ఆర్ అండ్ బిజిఎన్ఆర్ కళాశాల లైబ్రరీ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.విజయ్ కుమార్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ వారోత్సవాలకు ముఖ్యఅతిథిగా ఎస్ఆర్ అండ్ బిజిఎన్ఆర్ కళాశాల లైబ్రరీ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.విజయ్ కుమార్ హాజరై ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలను వేసి జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డాక్టర్ పి. విజయ్ కుమార్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 14 నుండి 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జరుపుకుంటామన్నారు. పుస్తకాల పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించడం, పఠన సంస్కృతిని అభివృద్ధి చేయడం, గ్రంథాలయాల ప్రాముఖ్యతను తెలియజేయడం వీటి ప్రధానలక్ష్యం అన్నారు. విద్యాసంస్థలు, ప్రభుత్వ గ్రంథాలయాలు అవగాహన ర్యాలీలు, పాఠన పోటీలు, సాహిత్య సదస్సులు వంటి అనేక కార్యక్రమాలలో విద్యార్థులు, యువత, పుస్తక ప్రియులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సునీత మాట్లాడుతూ... పఠనం ప్రతి వ్యక్తి వ్యక్తిత్వ వికాసానికి మేలునిచ్చే సాధనమని, గ్రంథాలయాలు జ్ఞానార్జనకు నిత్య వనరులని పేర్కొన్నారు. డిజిటల్ లైబ్రరీల వినియోగాన్ని కూడా ప్రజల్లో పెంపొందించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. వారోత్సవాల సందర్భంగా కొత్త పుస్తకాల విడుదల, రచయితల సమావేశాలు, పుస్తకాలను ప్రేమించే అలవాటును ప్రతి ఇంటికీ చేరవేయడమే ఈ వేడుకల ముఖ్య ఉద్దేశ్యమని వెల్లడించారు. ఇంత చక్కగా, ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించిన ఆశామేడంను ప్రిన్సిపాల్ అభినందించారు. ఇంకా ముందు ముందు ఇలాంటి ఎన్నో మంచి కార్యక్రమాలను కళాశాలలో నిర్వహించాలని ప్రశంసించారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సునీత, లైబ్రరీ సైన్స్ అధికారి డి.ఆశాజై, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ సెంటర్లో సంబురాలు జరుపుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



**తొర్రూరు ప్రతినిధి, నవంబర్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మరియు టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆదేశానుసారం తోరూర్ పట్టణంలోని మహాత్మా గాంధీ సెంటర్లో సంబరాలు జరుపుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ అత్యధిక మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తొర్రూరు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలో బాణ సంచకాలు కాల్చి మిఠాయిలు పంచుకుని ఘనంగా విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేకల కుమార్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఫలితం ప్రజల తీర్పు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంపై ప్రజల నమ్మకానికి నిదర్శనమన్నారు.. జూబ్లీహిల్స్ ప్రజలు ప్రజా ప్రభుత్వానికి పట్టం కట్టారని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా బ్లాక్ అధ్యక్షరాలు పింగిలి ఉష,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్ యాదవ్,పట్టణ అధ్యక్షుడు మహేష్ యాదవ్,నాయకులు చెవిటి సధాకర్, మోత్కూరి రవీంద్ర చారి, యూత్ జిల్లా నాయకులు అభిరాం నాయక్,గూడెల్లి రామచంద్రయ్య,మోకాటి వెంకన్న, వెంకట్ రెడ్డి, ఎనగందుల శ్రీనివాస్,యనమల శ్రీనివాస్,వల్లపు యాకయ్య, హపావత్ సురేష్,అనిత, జాటోత్ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులు సహకార బ్యాంక్ అభివృద్ధికి పాటుపడాలి






## బ్యాంకు చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు

## ఘనంగా 72వ అఖిల భారత సహకార బ్యాంక్ వారోత్సవాలు

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఉద్యోగులు సహకార బ్యాంక్ అభివృద్ధికిపాటుపడాలని ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయం నందు శుక్రవారం 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు జెండా ఆవిష్కరణచేసి వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఉద్యోగులు సహకార బ్యాంక్ బలోపేతానికి, బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తామని బ్యాంక్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు వారిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ సహకార శిక్షణ కేంద్రం వరంగల్ వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య, ఖమ్మం జిల్లా కేంద్ర సహకార అధికారి గంగాధర్, బ్యాంకు సీఈఓ వెంకట ఆదిత్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహకార అధికారి శ్రీనివాసరావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

